www.vishalabharati.com
epaper:vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్
20.10.2024
సంపుటి:2 సంచిక:364

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక





# ఎవరు అడ్డొచ్చినా..
# బుల్డోజర్లు ఆగవు

- కబ్జాదారుల పాలిట హైడ్రా అంకుశం
- రాష్ట్ర ఆర్థిక మూలాలు దెబ్బతీసేందుకు కుట్రలు
- మూసీ పునరుజ్జీవనం, హైడ్రా వేర్వేరు అంశాలు
- కేసీఆర్‌ది దోపిడీ కుటుంబం
- ఫాంహౌస్‌ల కోసమే కేటీఆర్, హరీశ్ డ్రామా
- కమిటీ వేసి నిజాలేంటో నిగ్గు తేలుద్దాం
- కేటీఆర్, హరీశ్‌కు సీఎం రేవంత్ సవాల్

..మిగతా 2 లో

# రైతు భరోసాకు బ్రేక్



రైతు భరోసా నిధులు ఎప్పుడెప్పుడు తమ ఖాతాల్లో పడతాయా..? అని ఎదురుచూస్తున్న వారికి నిరాశే మిగిలింది. ఈ సీజన్‌కు పెట్టుబడి సాయం లేనట్లేనని తేలిపోయింది. వానాకాలం సీజన్ పంట పెట్టుబడి సాయంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు చేశారు. కేబినెట్ సబ్ కమిటీ రిపోర్టు వచ్చాకే రైతు భరోసా అమలుచేస్తామని అప్పటిదాకా ఎలాంటి నిర్ణయం ఉండదని కుండబద్దలు కొట్టారు. శనివారం మీడియాతో మాట్లాడిన మంత్రి తుమ్మల.. ఈ ఖరీఫ్ సీజన్‌కు పంట పెట్టుబడి సాయం ఉండదని తేల్చి చెప్పారు. రైతు భరోసా స్కీమ్‌పై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశామని తెలిపారు. ఆ కమిటీ నివేదిక వచ్చిన తర్వాతే.. పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. అర్హత ఉన్న రైతుకు ప్రతి ఎకరానికి రూ. 7500 చెల్లిస్తామని పేర్కొన్నారు.

- ఈ సీజన్‌కు పెట్టుబడి సాయం లేనట్లే
- కేబినెట్ సబ్ కమిటీ నివేదిక వచ్చాకే నిర్ణయం
- వచ్చే సీజన్ నాటికి నిధులు అందిస్తాం
- అర్హత ఉన్న రైతుకు ప్రతి ఎకరానికి రూ. 7500
- అక్టోబర్ 31 నాటికి రుణమాఫీ కంప్లీట్
- పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేలు
- బీఆర్ఎస్ హయాంలో కొండలు, గుట్టలకూ రైతుబంధు
- నిధులు పక్కదారి పట్టినట్లు ఫిర్యాదులు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
తెలంగాణ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రక్రియలో ఇప్పటికే పలువురు రైతులకు రుణమాఫీ కాగా... సాంకేతిక కారణాలతో కొందరికిరుణమాఫీ నిలిచిపోయింది. దీనిపై మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. అక్టోబర్ 31 నాటికి రూ.2 లక్షలలోపు రుణాలు ఉన్న, అర్హులైన వారందరికీ రుణమాఫీ పూర్తి చేస్తామని స్పష్టమైన ప్రకటన చేశారు. నవంబర్ 1 నుంచి రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణాలున్న రైతుల రుణమాఫీపై ప్రక్రియ చేపడతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మొదటి పంట కాలంలోనే రూ.31 వేల కోట్ల రైతుల పంట రుణాలు మాఫీ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకూ 22 లక్షల రేషన్ కార్డులు కలిగిన రైతులకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ నగదు ఖాతాల్లో జమ చేశామన్నారు. ఈ నెలాఖరు నాటికి రేషన్ కార్డులు లేని మిగిలిన 4 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామన్నారు. రూ.2 లక్షల పైన రుణాల మాఫీపై షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. ఎట్టి పరిస్థితులలో ఈ పంట కాలంలోనే రూ.31 వేల కోట్లు రుణమాఫీ చేసి తీరుతామని తుమ్మల స్పష్టం చేశారు. ప్రకృతి విపత్తుల కారణంగా దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇస్తున్నామన్నారు.
అలాగే పంట బీమా పథకం కూడా వచ్చే సీజన్ నుంచి అమలు చేస్తామని వెల్లడించారు. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కే అన్ని పంటలను కొనుగోలు చేస్తున్నప్పటికీ... ప్రస్తుతం 25 శాతం మాత్రమే తీసుకుంటుందని కేంద్రం చెప్పారు. పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని కేంద్రానికి లేఖ రాశామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, టీజీ సీడ్స్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, రైతు సంఘాల నేతలు సారంపల్లి మల్లారెడ్డి, పశ్య పద్మ, నల్లమల వెంకటేశ్వరరావు, లోకసాని పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# 30 విమానాల్లో బాంబులు

- ఒక్క రోజే భారీగా బెదిరింపు కాల్స్
- గత 6 రోజుల్లో 70 విమానాలకు బెదిరింపులు
- రెచ్చిపోతున్న ఆకతాయిలు

**విశాలభారతి, న్యూఢిల్లీ:**
దేశవ్యాప్తంగా ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. ఇటీవల కాలంలో విమానాలకు బాంబు బెదిరింపు కాల్స్ ఎక్కువయ్యాయి. ఈ కాల్స్‌తో ఎయిర్ లైన్స్ సంస్థలు

..మిగతా 2 లో



# నిజామాబాద్‌లో గ్యాంగ్ రేప్

- బస్టాండ్ వద్ద ఆటోలో ఎక్కిన మహిళ
- డిచ్‌పల్లి ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం
- పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు

**విశాలభారతి, నిజామాబాద్:**
నిజామాబాద్ జిల్లాలో ఓ మహిళపై గ్యాంగ్ రేప్ కలకలం సృష్టిస్తోంది. ఆటోలో మహిళను ఎక్కించుకుని తీసుకెళ్లి ఈ దుర్ఘటనకు పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి ఈ ఘటన జరగగా శనివారం ఉదయం

..మిగతా 2 లో

# 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు
## ప్రతి సెగ్మెంట్ కు 4 వేల మందికి..

- పార్టీలకతీతంగా మంజూరు చేస్తాం
- నిధుల కొరత ఉన్నా వెనక్కు తగ్గం
- దీపావళి ముందే డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తున్నాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి సర్కార్ దీపావళి కానుక ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలోని పేద ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పంపిణీపై మంత్రి తీపికబురు వినిపించారు. అక్టోబర్ నెలాఖరులోగా.. మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ చేయనున్నట్టు ప్రకటించారు. హైదరాబాద్ కలెక్టరేట్ గోషామహల్ నియోజకవర్గంలోని లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలను మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు రాజాసింగ్, గణేష్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో కలిసి మంత్రి పొంగులేటి పంపిణీ చేశారు. మొత్తం.. 144 మంది లబ్ధిదారులకు మేడ్చల్ జిల్లాలోని రాంపల్లిలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి... ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ గురించి చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 నుంచి 4,000 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

..మిగతా 2 లో



# బావలు సయ్యా.. సై సై..

- నగరంలోని పబ్బుల్లో అశ్లీల డ్యాన్స్‌లు
- అర్ధరాత్రి టాస్క్‌ఫోర్స్ దాడులు
- 42 మంది యువతులు, 100 మంది యువకుల అరెస్ట్

**విశాలభారతి, హైదరాబాద్:**
హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని టాస్ పబ్బుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడులు జరిపారు. నిబంధనలకు విరుద్ధంగా యువతులతో అశ్లీల నృత్యాలు చేయిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు తనిఖీలు చేశారు. పబ్‌కు వచ్చే కస్టమర్లను ఆకర్షించేందుకు నిర్వాహకులు యువతులతో అసభ్యకరమైన నృత్యాలు చేయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, దాడుల సమయంలో పబ్‌లో ఉన్న 100 మంది యువకులను, 42 మంది యువతులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ యువతులు పబ్‌కు వచ్చే వారితో చనువుగా ఉంటూ

..మిగతా 2 లో



# జాతీయ మహిళా కమిషన్ చీఫ్‌గా విజయ కిషోర్ రహత్కర్

- సభ్యురాలిగా అర్చన మజుందార్
- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం

**విశాలభారతి, న్యూఢిల్లీ:**
జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు) కొత్త చైర్‌పర్సన్‌గా విజయ కిషోర్ రహత్కర్‌ను నరేంద్ర మోడీ ప్రభుత్వం శనివారం నియమించింది. " సెక్షన్ 3, ఎన్‌సీడబ్ల్యూ చట్టం, 1990 ప్రకారం కేంద్ర ప్రభుత్వం జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా విజయ కిషోర్ రహత్కర్ ని

..మిగతా 2 లో



# చలో సెక్రటేరియట్ ఉద్రిక్తం

- గ్రూప్–1 అభ్యర్థుల ఆందోళన
- మద్దతు తెలిపిన బీఆర్ఎస్, బీజేపీ
- బీఆర్ఎస్ నేతలను అడ్డుకున్న అభ్యర్థులు
- గోబ్యాక్ అంటూ పలువురి నినాదాలు
- ఇరు పార్టీల కార్యకర్తల మధ్య వాగ్వాదం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ అరెస్ట్

**విశాలభారతి, స్టేట్‌బ్యూరో:**
గ్రూప్ 1 అభ్యర్థుల చలో సెక్రటేరియట్ ఉద్రిక్తంగా మారింది. పరీక్షలు వాయిదా వేయాలంటూ గత కొన్ని రోజులుగా వీరు చేస్తున్న ఆందోళనలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులతో కలిసి అశోక్‌నగర్ నుంచి

..మిగతా 2 లో

# ఒకడు లుచ్చా.. మరొకడు బచ్చా..
## బావాబామ్మర్దులకు ఓడినా బలుపు తగ్గలే..

- కేటీఆర్ జైలుకెళ్లడం ఖాయం
- ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలో అరెస్ట్
- నేను, రేవంత్ రాజకీయాల్లో కష్టపడి పైకొచ్చాం
- కేటీఆర్‌లాగా రెడీమేడ్ నాయకులం కాదు
- హామీలపై ఇష్టమొచ్చినట్లు వాగుతున్నరు
- అరేయ్ పిచ్చి కేటీఆర్.. మేం చేసేదే చెప్పాం
- మూసీ ప్రక్షాళనకు అడ్డుపడితే మరో ఉద్యమం
- మీ ఇండ్ల ముందు నిరసన దీక్షలు చేస్తాం
- విషం నింపి నల్గొండ ప్రజలను చంపాలని చూస్తున్నారు
- ప్రాజెక్టుల పేరు చెప్పి లక్షల కోట్లు దోచేశారు
- మిషన్ భగీరథలో వేల కోట్లు మింగేశారు
- కేటీఆర్, హరీష్‌లపై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జైలుకెళ్లడం ఖాయమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయనను ఎప్పుడైనా అరెస్టు చేసే అవకాశం ఉందని తెలిపారు. శనివారం నాడు సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. అధికారం పోయినా కేటీఆర్‌కు ఇంకా బలుపు తగ్గలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్‌నేతలు మూసీ ప్రక్షాళనకు అడ్డు పడితే నల్గొండ, రంగారెడ్డి ప్రజల నుంచి మరొక ఉద్యమం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ ఫామ్ హౌజ్‌లను ముట్టడిస్తామని చెప్పారు.
**కేటీఆర్.. డాక్టర్‌కు చూపించుకో..**
కేటీఆర్ కు అధికారం పోయినా అహంకారం తగ్గలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని, సీఎంపై అసభ్యకరంగా మాట్లాడుతున్నడని.. జుమ్లా మోడీ, హౌలా సీఎం అని అంటావా.. నీకసలు కొంచెమైనా సభ్యత ఉందా? అని ప్రశ్నించారు. మీకు డబ్బుంటే ప్రజలు ఎన్నుకున్న




..మిగతా 2 లో



# ఎవరు అడ్డొచ్చినా.. బుల్డోజర్లు ఆగవు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
హైడ్రాకు ఎవరు అడ్డొచ్చినా ఆగేది లేదని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఆక్రమణలకు పాల్పడిన బడా బాబులకు హైడ్రా ఓ భూతం, ప్రభుత్వ భూములను, నాలాలు, చెరువులను ఆక్రమించి పెద్ద పెద్ద భవంతులు కట్టినోళ్లపై హైడ్రా ఓ అంకుశం, మదపుటేనుగులను అణచటానికి ఈ హైడ్రా అంకుశంలా పనిచేస్తుంది. కొందరు దీన్ని అడ్డుకోవాలని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ సంస్థలు భయపడొద్దు.. మీకు అండగా ఉంటామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. చార్మినార్ వద్ద శనివారం నాడు రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక దినోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు.

**ఆర్థిక మూలాలు దెబ్బతీసే కుట్ర..**
రాష్ట్ర ఆర్థిక మూలలను దెబ్బ తీయాలని కొంతమంది కుట్ర చేస్తున్నారని, రియల్ ఎస్టేట్ సంస్థలు భయపడొద్దు.. అండగా ఉంటానని హామీ ఇస్తున్నా అని సీఎం స్పష్టం చేశారు. ''మా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. హైడ్రా ఆగదు, అక్రమార్కులకు కంటి మీద కునుకు ఉండదు. హైడ్రా అనగానే హరీశ్, కేటీఆర్ బయటకు వస్తున్నారు. పేదలకు మేలు జరిగితే చూసి ఓర్వలేకపోతున్నారు''అని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీలో మగ్గిపోతున్న పేదలకు ఇండ్లు ఇచ్చి, వ్యాపారాలు చేసుకునేందుకు మహిళలకు ఆర్థిక సాయం అందించాం. మేం జనాన్ని గుండెల్లో పెట్టుకుంటుంటే బీఆర్ఎస్ నేతలు గుండెలు బాదుకుంటున్నారని విమర్శించారు.

**ఫామ్‌హౌస్‌ల కోసమే ఆరాటం..**
ఈ బిల్లా రంగాలు వచ్చి బుల్డోజర్లకు అడ్డు పడతామంటున్నారు. అక్కడికి ఇక్కడికి కాదు.. జన్వాడ ఫామ్ హౌస్‌కు పోదాం పదా, గుల్భాపూర్ నాలాను ఆక్రమించి కేటీఆర్ ఫామ్ హౌస్ కట్టలేదా?, ఈ ఫామ్ హౌస్‌కు బుల్డోజర్ వస్తుందనే ఇక్కడ వీళ్లు డ్రామాలు ఆడుతున్నారు, హరీశ్.. నీలాంటి చెప్పులు మోసే వారు కాదు.. ఫామ్ హౌస్‌లో పడుకున్న వాళ్లను రమ్మను నేను వస్తా. అని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. నా ఇంటి ముందుకు వచ్చి చేతులు కట్టుకుని నిలబడ్డ రోజులు మర్చిపోయావా? ఫామ్ హౌసులు కాపాడుకునేందుకే ఈ బిల్లా రంగాల దొంగ ఏడ్పులు అని న ిలదీశారు.

**మూసీ వేరు.. హైడ్రా వేరు**
మూసీ పునరుజ్జీవనం, హైడ్రా వేర్వేరు కార్యక్రమాలని.. మూసీలో హైడ్రా ఎలాంటి కూల్చివేతలు చేపట్టలేదని సీఎం తెలిపారు. ట్రాఫిక్ సమస్య, నాలాల పునరుద్ధరణ, చెరువుల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడానికే హైడ్రాను తీసుకువచ్చాం, బీఆర్ఎస్ వాళ్ల తాపత్రయం అంతా.. వాళ్ల ఆస్తులు కాపాడుకునేందుకేనని తెలిపారు. కేసీఆర్ ఫ్యామిలీకి దోపిడీ చరిత్ర ఉందన్నారు. ఎప్పుడైనా ఫామ్ హౌస్ కు రమ్మని సవాల్ చేశారా? అని రేవంత్ ప్రశ్నించారు. వాళ్ల ఫామ్ హౌస్‌ల వద్దకు ఎప్పుడు రావాలో హరీశ్ చెప్పాలి. హరీశ్, కేటీఆర్ ఫామ్ హౌస్ ల విషయంపై అఖిలపక్షం పిలుద్దాం.. నిజ నిర్ధారణ కమిటీతో నిజాలు నిగ్గు తేలుద్దాం.. ఆ తరువాత మూసీ దగ్గరకా.. ఇంకెక్కడికైనానా వెళదాం అని సీఎం రేవంత్ రెడ్డి సవాళ్లపై సవాళ్లు విసిరారు.

# 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

**మొదటిపేజీ తరువాయి**
చేయనున్నట్లు మంత్రి తెలిపారు. రానున్న నాలుగేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకొచ్చారు. పార్టీలకు అతీతంగా పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. లక్షా 50 వేల ఇండ్లకు టెండర్లు పిలిచామని.. 98 వేల ఇండ్లు కట్టామని, 40 వేల ఇండ్లు ఇప్పటికే పంపిణీ చేశామని.. ఇంకా 58 వేలు పంపిణీ చేయాల్సివుందని చెప్పిన గత బీఆర్ఎస్ సర్కార్.. వాటిని కేవలం ఎన్నికల్లో ఓట్ల కోసమే వాడుకుందని విమర్శించారు.
బీఆర్ఎస్ పాలకులు డబుల్ బెడ్ రూం ఇండ్లలోనైనా, ఉద్యోగాల్లోనైనా, ప్రాజెక్టుల్లోనైనా కేవలం రాజకీయ అర్భాటాన్ని ప్రదర్శించారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. తమ ప్రభుత్వం అసంపూర్తిగా వదివేసిన ఇండ్లను పూర్తి చేయించడంతో పాటు కొత్తగా ఇందిరమ్మ ఇండ్లు కూడా మంజూరు చేస్తామని చెప్పుకొచ్చారు. నిధుల కొరత ఉన్నప్పటికీ పేదలను ఆదుకోవటం కోసం అమలు చేస్తున్న పథకాల విషయంలో మాత్రం ఎక్కడా రాజీ పడటం లేదని చెప్పుకొచ్చారు.
మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... దీపావళి పండగను కొత్త ఇంట్లో జరుపుకునేలా పండగకు ముందే ఇళ్లు ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. రాంపల్లి డబుల్ బెడ్ రూం ఇండ్లలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు. లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇండ్లను, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

# యథావిధిగా గ్రూప్–1

- షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు
- మోసగాళ్లతో జాగ్రత్త..
- నిరుద్యోగులు వాళ్ల ట్రాప్‌లో పడొద్దు
- పరీక్షలు వాయిదా వేయడం కరెక్ట్ కాదు
- అన్ని జాగ్రత్తలతో జీవో 29 తీసుకొచ్చాం
- నిబంధనలు మారిస్తే చిక్కులొస్తాయి
- నిరుద్యోగులపై పోలీసులు కేసులు పెట్టొద్దు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
తెలంగాణలో గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై వివాదం రేగుతోన్న వేళ సీఎం రేవంత్ రెడ్డి శనివారం ఈ అంశంపై స్పందించారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించిన పోలీస్ డ్యూటీ మీట్ ముగింపు వేడుకలకు సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లోనూ షెడ్యూల్ ప్రకారం గ్రూప్1 పరీక్షలు నిర్వహించి తీరుతామని తెలిపారు. తరచూ పరీక్షలు వాయిదా వేయడం వల్ల విద్యార్థులు నష్టపోతారని.. కొన్ని పార్టీల మాయమాటలు నమ్మి మోసపోవద్దని అభ్యర్థులకు సూచించారు. గతంలో అభ్యర్థులు ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లు, లైబ్రరీల చుట్టూ తిరిగేవారని.. పరీక్షల వాయిదాల వల్ల ఇతర ఉద్యోగాలు సైతం చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు.

**నిబంధనలు మారిస్తే చిక్కులు..**
''నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత నిబంధనలు మారిస్తే కోర్టులు కొట్టేస్తాయి. జీవో 55 ప్రకారం పోతే.. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు నష్టం జరిగేది. మెయిన్స్‌లో 1:50కి కూడా రిజర్వేషన్లు పాటిస్తున్నాం. గడిచిన పదేళ్లలో ఉద్యోగాల భర్తీని ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రిలిమ్స్ పరీక్ష అయ్యాక విపక్షాలు ఆందోళన చేస్తున్నాయి'' అని రేవంత్ పేర్కొన్నారు.

**'ఆందోళనలు విరమించండి'**
అభ్యర్థులు ఇప్పటికైనా ఆందోళనలు విరమించి పరీక్షలకు సన్నద్ధం కావాలని సీఎం రేవంత్ సూచించారు. జీవో 55ప్రకారం భర్తీ చేస్తే ఎస్సీ,ఎస్టీ, బీసీ అభ్యర్థులు నష్టపోతారని అందుకే జీవో 29తీసుకువచ్చినట్లు వివరించారు. గత పదేళ్లలో నిరుద్యోగులను బీఆర్ఎస్ నేతలు ఎప్పుడైనా కలిశారా? అని ప్రశ్నించారు. ఎప్పుడైనా ప్రగతి భవన్‌కు పిలిపించుకున్నారా? అశోక్ నగర్‌కు ఎప్పుడైనా వచ్చి మాట్లాడారా? అని నిలదీశారు. 'పరీక్షల నిర్వహణ విధానాన్ని న్యాయస్థానాలు కూడా సమర్థించాయి. మోసగాళ్ల మాటలు విని మోసపోవద్దని నిరుద్యోగులను కోరుతున్నా.

**నిరుద్యోగులపై కేసులు పెట్టొద్దు..**
పోలీసులు ఆందోళన చేస్తున్న నిరుద్యోగులపై లాఠీచార్జ్ చెయ్యొద్దని.. కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయొద్దని సీఎం రేవంత్ సూచించారు. అభ్యర్థుల పట్ల పోలీస్ సిబ్బంది ఉదారంగా వ్యవహరించాలన్నారు. కేసులు పెట్టొద్దని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు.

**మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్‌ను అరికట్టాలి**
రాష్ట్ర ప్రభుత్వ గౌరవం పోలీసులపై ఉంటుందని వెల్లడించారు. పోలీసు శాఖలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్‌ను అరికట్టాలని తెలిపారు. సైబర్ క్రైమ్‌ను నియంత్రించడంలో దేశంలోనే ఉత్తమ అవార్డ్ రావడం సంతోషమని సీఎం పేర్కొన్నారు. సైబర్ క్రైమ్, డ్రగ్స్ ను నియంత్రణ చేసేందుకు ప్రకటనలు ఇచ్చే సినిమాలకే టికెట్ ధర పెంపు, ఇతర రాయితీలు ఇస్తున్నామని వివరించారు.

# ఒకడు లుచ్చా.. మరొకడు బచ్చా..

**మొదటిపేజీ తరువాయి**
ప్రభుత్వధినేతలు కనిపించరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం పోవడంతో కేటీఆర్ మానసికంగా ఇబ్బందులు పడ్డట్టు కనిపిస్తుందని.. డాక్టర్ కు చూపించుకోవాలని సలహా ఇచ్చారు. రైతు కుటుంబంలో పుట్టిన నేను, సీఎం రేవంత్ రెడ్డి రాజకీయాల్లో కష్టపడి పైకొచ్చామని తెలిపారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్‌లాగా రెడీమేడ్‌గా అమెరికా నుంచి రాలేదన్నారు. తెలంగాణ ఉద్యమం టైమ్‌లో ఇక్కడకు వచ్చి రెండు సార్లు అరెస్ట్ అయ్యాడన్నారు. కేసీఆర్ కొడుకంటే గుర్తుపడతారని.. కేటీఆర్ అంటే ఎవరికీ తెల్వదన్నారు. పదేళ్లలో వందల దేశాలు తిరిగారని.. ఏమి సాధించారో చెప్పాలన్నారు. మేం జెడ్పీ స్కూల్లో చదివినా సంస్కారవంతంగా మాట్లాడతామని.. అమెరికాకు పోయి చదువుకున్న కేటీఆర్ కోట్ల మంది ప్రజల ప్రాణాలను బలితీసుకోవాలని చూడటం బాధాకరమని ఆయన అన్నారు. కేటీఆర్ తానేదో పెద్ద పెద్ద నిర్మాణాలు చేసినట్లు మాట్లాడుతున్నారని.. ఒక కొత్త కంపెనీ అయినా తీసుకొచ్చినవా? అని మండిపడ్డారు. టీహబ్, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి తప్ప కేటీఆర్ చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఓఆర్ఆర్, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లాంటివి కట్టామని ఎన్నో ఎంఎన్‌సీ సంస్థలు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఏర్పడ్డాయని వివరించారు.

**లక్షల కోట్లు దోచుకున్నరు..**
కాళేశ్వరం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ ఇంకా ఏవో పేర్లు చెప్పి పదేళ్లలో లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. పదేళ్ల కింద 25 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే మా జిల్లా సమస్య పరిష్కారం అయ్యేదని తెలిపారు. హామీలు అమలుచేయలేదని.. వంద అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారని.. కేటీఆర్ తమపై అవాకులు చెవాకులు పేలుతున్నాడని.. వాడు(కేటీఆర్) తలకాయ ఉండి మాట్లాడుతున్నడా అని మండిపడ్డారు. అరె పిచ్చి కేటీఆర్.. చేసేదే చెప్పాం. మీలాగా అమలు కాని హామీలు ఇవ్వలేదన్నారు. ఎంత కష్టం అయినా నెల మొదటి రోజే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామన్నారు. కేటీఆర్, హరీష్‌కు ఏం పుట్టిందో తెలియదని.. అసలు మీకు రాజకీయాలు వస్తాయా అని ప్రశ్నించారు. అసెంబ్లీ, పార్లమెంట్ లో ఓడిపోయిన బీఆర్ఎస్ వాళ్ళు వేరే దేశానికి వెళ్లి బ్రతుకుతారని తాను అనుకున్నానని.. కానీ సిగ్గు లేకుండా రోడ్ల మీద తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



**మూసీ ప్రక్షాళనకు అడ్డుపడితే ఊరుకోం**
బీఆర్ఎస్‌నేతలు మూసీ ప్రక్షాళనకు అడ్డుపడితే నల్గొండ, రంగారెడ్డి ప్రజల నుంచి మరొక ఉద్యమం తప్పదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హెచ్చరించారు. మూసీ విషయంలో ఇదే వైఖరి వారు కొనసాగిస్తే.. కేసీఆర్, కేటీఆర్, హరీష్ ఫాంహౌజులను ముట్టడిస్తామని, వారి ఇళ్ల ముందు నిరసన దీక్షలు చేపడతామని చెప్పారు. నల్గొండలో అనారోగ్యం బారిన పడిన వారు చాలా మంది ఉన్నారని.. ఎన్నో వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎస్‌టీపీలతో సమస్య పరిష్కారం కాదని.. స్వచ్ఛమైన నీరు ఇవ్వాలని మంత్రి తెలిపారు. మూసీ కాలుష్యంతో ప్రజలు క్యాన్సర్, నరాల జబ్బులు, గుండె, కిడ్నీ లు పాడైపోవడం, పిల్లల్లో పెరుగుదల లోపించడం, కంటి సమస్యలు, చర్మ వ్యాధులతో నానా అవస్థలు పడుతున్నారని... ఇంకా వాళ్ళు అలాగే చచ్చిపోవాలని కేటీఆర్ కోరుకుంటున్నారా అంటూ ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ మోసాలకు ఇప్పటికే నల్గొండ నరకయాతన పడుతున్నదని.. ఇప్పుడు ఆయన కొడుకు మోపయ్యిండని ఆక్షేపించారు. ఎవ్వరు అడ్డువచ్చినా మూసీ విషయంలో వెనకడుగు వేసే పరిస్థితి లేదని తేల్చిచెప్పారు. మూసీ డీపీఆర్ చేసిన మెయిన్ హార్ట్ టీ కంపెనీ 29 దేశాల్లో అద్భుతమైన కట్టడాలను కట్టిందని ఎక్కడో పాకిస్థాన్ లో కేసు అయ్యిందని... మూసీపై అవినీతి బురద జల్లడం దారుణమని ఆయన మండిపడ్డారు. గడిచిన పదేండ్లలో నల్గొండ జిల్లాకు తీరని అన్యాయం చేశారని ఆయన మండిపడ్డారు. నల్గొండ ప్రజల్ని నాయకులు రెచ్చగొడుతున్నారని చెబుతున్న కేటీఆర్ మాటలు పూర్తిగా సత్యదూరమని చెప్పిన ఆయన.. నల్గొండ ప్రజలు రెచ్చగొడితే రెచ్చిపోయేంత అమాయకులు కాదని... స్వతహాగా పౌరుషం ఉన్న వ్యక్తులమని ఆయన అన్నారు. 2 వేల కోట్లు పెట్టి 9 కిలోమీటర్ల ఎస్.ఎల్.బీ.సీ సొరంగం పని పూర్తి చేస్తే ఇవాళ నాలుగు లక్షల ఎకరాల నల్గొండ భూములు బంగారు మాగాణంగా మారేవని, ఫ్లోరైడ్ ఇబ్బందులు తప్పేవని.. కేవలం నాకు పేరొస్తుందనే ఎస్ఎల్బీసీ సొరంగాన్ని పదేండ్లు పక్కన పెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**నల్గొండలో ఫ్లోరైడ్ పెరిగింది**
రీసెంట్ నివేదిక ప్రకారం నల్గొండలో ఫ్లోరైడ్ పెరిగిందని మంత్రి అన్నారు. ఫ్లోరైడ్ రూపుమాపామని కేసీఆర్, కొడుకు, అల్లుడు చెబుతుంటారని విమర్శించారు. మిషన్ భగీరథ కింద రూ. 6 వేల కోట్లు ఖర్చు పెట్టారని, అందులో వాళ్లు రూ. 5 వేల కోట్లు దోచుకున్నరని ఆరోపించారు. హరీశ్ రావు నాటకాల రాయుడు, పొద్దున లేస్తే పిచ్చి పట్టినట్లు మొరుగుతున్నాడని విమర్శించారు. ఎవరో చెబితే వినే రక్తం మా నల్గొండోళ్లది కాదన్నారు. ఫ్లోరైడ్ కు శాశ్వత పరిష్కారం ఎస్ఎల్‌బీసీ అని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ, మూసీ శుద్ధీకరణ విషయంలో ముఖ్యమంత్రిని అభినందుస్తున్నట్లు తెలిపారు. ఒక వైపు ఫ్లోరైడ్, మరోవైపు కోటిన్నర మంది వాడిన నీరు నల్గొండలో పారుతోందన్నారు.

**బావాబామ్మర్దులు దొంగలు..**
అసలు కేటీఆర్, హరీష్ రావులు నాయకులే కాదని అన్నారు. అన్నింటిలో భాగస్వామ్యాలు ఉన్నాయని.. నారాయణ సంస్థల్లో హరీష్‌కు వాటా ఉందని తెలిపారు. కేటీఆర్, హరీష్ దొంగలని... అందుకే వాళ్ళ విషయాలు అందరికీ తెలియాలని మాట్లాడుతున్నానన్నారు. అమెరికా వెళ్లి ప్రభాకర్ రావును కలిసి కాళ్ళు పట్టుకుని మరీ ఇండియాకు రావొద్దని బ్రతిమిలాడినట్లు తెలిపారు. కేటీఆర్, హరీష్ రావులకు నల్గొండ వాళ్లంటే ఎందుకు అంత కోపమని ప్రశ్నించారు. ''విషం పెట్టి చంపండి, లేదంటే మేమే చచ్చి పోతాం'' అంటూ వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్, హరీష్ మూసీ ప్రజలను రెచ్చ గొడుతున్నారని.. వాళ్ళ ఇంటి వద్ద ఎక్కడపడితే అక్కడ శాంతియుత పద్ధతిలో నిరసన చెబుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు.

**మూసీలో ప్రమాదకర స్థాయిలో హెవీ మెటల్స్**
ఆగష్టులో కేంద్ర పర్యావరణ సంస్థ మూసీలో ప్రమాదకరస్థాయిలో హెవీ మెటల్స్ ఉన్నాయని చెప్పిన సంగతి కేటీఆర్ కు తెలియదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మేం మంత్రులం అందరం కలిసి ముఖ్యమంత్రితో చర్చించి మూసీ కి పరిష్కారం చూపెట్టాలని కోరామని తెలిపిన మంత్రి.. కోటి మంది తెలంగాణ బిడ్డల బతుకులు బాగు చేసేందుకే మూసీ శుద్ధీకరణను తీసుకున్నామని ఆయన వివరించారు. కేసిఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత మూసీలో ఫ్లోరిన్ తో పాటు, ఇతర హెవీ మెటల్స్ పెరిగాయని కేంద్ర ప్రభుత్వ సంస్థలు తేల్చిన విషయం కేటీఆర్ కు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. ఎస్టీపీల ద్వారా రెండు మూడు దశల్లో ట్రీట్మెంట్ చేసినప్పటికి వందశాతం హెవీ మెటల్స్ ను తీసివేయలేమని ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు చెప్తుంటే ఎస్టీపీ ద్వారా నల్గొండకు స్వచ్ఛమైన నీళ్లు ఇవ్వడానికి ప్రయత్నించామని చెప్పడం ఏంటని ప్రశ్నించారు.

**నల్గొండ చిట్టినాయుడికి సమస్యలు పట్టవు..**
నల్గొండలో పుట్టిన చిట్టి నాయుడు(మాజీ మంత్రిని ఉద్దేశించి) ఒకరు మొన్నటి ఎన్నికల్లో 3 వేల ఓట్లతో గెలిచినప్పటికి ఆయనకు నల్గొండ సమస్యలు పట్టవని అన్నారు.. బస్సు కిరాయిలు లేనోడికి ఇప్పుడు 80 ఎకరాల ఫామ్ హౌస్ ఉందని.. ఉప్పల్‌లో వాటర్ ప్లాంట్ పెట్టి నడిపిన వ్యక్తి.. కేసీఆర్ కు ఉన్నంత ఫామ్ హౌజ్ ఎట్లా వచ్చిందని ప్రశ్నించారు. అధికారం అడ్డం పెట్టుకొని పది వేల కోట్లు దోచుకున్న ఆ చిట్టి నాయుడు.. ఎప్పుడు నల్గొండ బిడ్డల బాగుకోసం పని చేయలేదని ఆరోపించారు.. మొన్నటి ఎన్నికల్లో మా అభ్యర్థి దామోదర్ రెడ్డి కి మోకాలి ఆపరేషన్ కావడంతో చిట్టి నాయుడు బతికి బయటపడ్డాడని లేదంటే యాభై వేల మెజార్టీతో ఇంటికి పంపే వాళ్లమని తేల్చిచెప్పారు.



# 30 విమానాల్లో బాంబులు

**మొదటిపేజీ తరువాయి**
చిర్రెత్తిపోతున్నాయి. ఎప్పుడు ఏ వైపు నుంచి బెదిరింపులు వస్తాయో.. విమానాన్ని ఎటు వైపు అత్యవసరంగా మళ్లించాలో అనే టెన్షన్ నెలకొంది. గడిచిన 6 రోజుల్లో 70 విమానాలకు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. శనివారం ఒక్క రోజే 30 విమానాలకు బెదిరింపులు రావడం గమనార్హం. ఇందులో ఎయిర్ ఇండియా, ఇండిగో, ఆకాశ ఎయిర్, విస్తారా, స్పైస్ జెట్, స్టార్ ఎయిర్, అలయన్స్ ఎయిర్ వంటి ఎయిర్‌లైన్లు ఉన్నాయి. కొన్ని బెదిరింపులు ఫోన్ కాల్స్ రూపంలో రాగా.. చాలా వరకు సోషల్ మీడియాలో వస్తున్నాయి. ఐపీ అడ్రెస్‌ల ఆధారంగా నిందితులను పట్టుకునే ప్రయత్నం చేసిన పోలీసులకు ఈ ఐపీ అడ్రెస్‌లు లండన్, జర్మనీ, కెనడా, యూఎస్‌లలో ఉన్నట్టు చూపిస్తున్నాయి. వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్‌ను వినియోగించి వాస్తవ లొకేషన్‌ను కప్పిపుచ్చే అవకాశాన్నీ తోసిపుచ్చలేమని అధికారులు తెలిపారు. ఈ బెదిరింపుల నేపథ్యంలోనే ఎయిర్‌లైన్ల సీఈవోలతో బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ(బీసీఏఎస్) ఢిల్లీలో శనివారం సమావేశమైంది. రాజీవ్ గాంధీ భవన్‌లోని సివిల్ ఏవియేషన్ మినిస్ట్రీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఈ బెదిరింపులను ఎదుర్కోవడానికి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను ఫాలో కావాలని సీఈవోలకు సూచించారు. ఇలా వచ్చిన బెదిరింపులను, వాటిని ఎదుర్కోవడానికి చేపట్టిన చర్యలనూ ఎప్పటికప్పుడు ప్రయాణికులు సహా భాగస్వాములందరికీ తెలియజేయాలని చెప్పారు. ఇలా బాంబు బెదిరింపులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి బీసీఏఎస్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ)లు కొత్త మార్గదర్శకాలను రూపొందించి విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి.



# బీజేపీ కంట్రోల్‌లో ఈసీ

- సీబీఐ, ఈడీ, ఐటీ, న్యాయశాఖలను నియంత్రిస్తున్నారు
- రాజ్యాంగంపై అన్నివైపుల నుంచి దాడి
- ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ

**విశాలభారతి, నేషనల్ న్యూస్:**
ఝార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బీజేపీపై విమర్శల వర్షం కురిపించారు. మోదీ సర్కార్ ఎన్నికల కమిషన్, సీబీఐ, ఈడీ, అదాయ పన్ను శాఖ, న్యాయశాఖ సహా, ప్రభుత్వ అధికారులను (బ్యూరోక్రసీ) నియంత్రిస్తోందని ఆరోపించారు. భారత రాజ్యాంగంపై అన్ని వైపుల నుంచి దాడి జరుగుతోందని, దానిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాంచీలో జరిగిన 'సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్'లో పాల్గొన్న రాహుల్ గాంధీ ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలపై ఘాటు విమర్శలు చేశారు. కుల గణనను, రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగించడాన్ని ఏ శక్తీ అడ్డుకోలేదని రాహుల్ గాంధీ అన్నారు. 'ప్రధాని మోదీ దళితులను, ఆదివాసీలను, వెనుకబడిన తరగతులను గౌరవిస్తానని చెబుతారు. ఆయన మిమ్మల్ని గౌరవిస్తారు, కానీ, అనేక వ్యవస్థల నుంచి మిమ్మల్ని బయటికి తరిమేస్తారు.' అని పేర్కొన్నారు.

# నిజామాబాద్‌లో గ్యాంగ్ రేప్

**మొదటిపేజీ తరువాయి**
బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం(అక్టోబర్ 18)న రాత్రి ఒంటరిగా ఉన్న ఓ మహిళను నలుగురు వ్యక్తులు ఆటోలో నిజామాబాద్ బస్టాండ్ వద్ద ఎక్కించుకున్నారు. అక్కడి నుంచి డిచ్‌పల్లి ప్రాంతానికి తీసుకువెళ్లి దారుణమైన అఘాయిత్యానికి పాల్పడ్డారు. అనంతరం బాధితురాలు నగరానికి చేరుకుని శనివారం ఉదయం జిల్లా కేంద్రంలోని వన్ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ అత్యాచారానికి పాల్పడిన వారు డిచ్‌పల్లికి చెంది ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. బాధిత మహిళను వెంటబెట్టుకుని ఘటనాస్థలికి తీసుకెళ్లి పోలీసులు పరిశీలించారు. బస్టాండ్ వద్ద ఆటోకు సంబంధించిన సీసీ కెమెరాలో రికార్డయిన వీడియో ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. నిజామాబాద్‌లో ఈ ఘటన సంచలనం రేపింది. నిందితులను వీలైనంత త్వరగా పట్టుకొని కఠినంగా శిక్షించాలని స్థానికులు, మహిళా సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా రాత్రి వేళ పోలీసుల పెట్రోలింగ్ పెంచాలని కూడా వారు కోరుతున్నారు.

# బావలు సయ్యా.. సైసై..

**మొదటిపేజీ తరువాయి**
మద్యం సేవిస్తున్నట్లు నటించి, శీతల పానీయాలు తాగి, కస్టమర్లతో మద్యం తాగిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇలా కస్టమర్‌తో ఎక్కువ బిల్ చేయించిన యువతికి కమీషన్ ఉన్నట్లు తెలిపారు. అంతేకాదు పోలీసులు ఈ దాడి ఘటనలో వాళ్ల వివరాలను గోప్యంగా ఉంచినట్టు తెలుస్తోంది. మొత్తంగా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ లో సినీ, రాజకీయ పలుకుబడి ఉన్న వాళ్లు ఈ పబ్ కు తరుచుగా వస్తుంటారని సమాచారం. వాళ్ల కోసమే పబ్ నిర్వహకులు... వేరే రాష్ట్రానికి చెందిన కొంత మంది యువతులతో సినిమాల్లో చూపించిన మాదిరి అసభ్యకరమైన డాన్సులు, స్టెప్పులతో కస్టమర్స్ ను ఆకర్షిస్తున్నారు.

## జాతీయ మహిళా కమిషన్ చీఫ్‌గా
# విజయ కిషోర్ రహత్కర్

**మొదటిపేజీ తరువాయి**
నామినేట్ చేసిందని తెలుపడానికి ఎన్‌సిడబ్ల్యు ఆనందిస్తోంది" అని మహిళా ప్యానెల్ ఎక్స్ పోస్ట్ లో పేర్కొంది. రహత్కర్ పదవీకాలం వెంటనే ప్రారంభమవుతుంది. ఈ ప్రకటన గెజిట్ ఆఫ్ ఇండియాలో ప్రచురించబడుతుంది. రహత్కర్ నియామకంతో పాటు ప్రభుత్వం ఎన్‌సిడబ్ల్యుకి కొత్త సభ్యులను కూడా నియమించింది. ఎన్‌సిడబ్ల్యు చీఫ్‌గా ఉన్న రేఖా శర్మ పదవీకాలం ఆగస్టు 6తో ముగియడంతో విజయ కిషోర్ రహత్కర్ ఆ స్థానంలోకి వచ్చారు. ఆమె పదవీ కాలం మూడేళ్లు లేక ఆమెకు 65 ఏళ్లు నిండే వరకు ఉంటుంది.

# చలో సెక్రటేరియట్ ఉద్రిక్తం

**మొదటిపేజీ తరువాయి**
సెక్రటేరియట్ వైపు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీనికి నిరసనగా బండి సంజయ్ రోడ్డుపైనే బైఠాయించారు. దీంతో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకుని పార్టీ ఆఫీసుకు తరలించారు. ఇదే సమయంలో గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతు తెలిపేందుకు బీఆర్ఎస్ నాయకులు అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య వాగ్వాదం జరిగింది. బీఆర్ఎస్ నేతలకు కొందరు గ్రూప్1 అభ్యర్థులు అడ్డుకున్నారు. గులాబీ పార్టీకి వ్యతిరేకంగా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆందోళనకారులకు మద్దతు తెలిపేందుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకుల్ని అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. గ్రూప్1 మెయిన్స్ పరీక్షపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఆందోళనలో ఉన్న విద్యార్థులు పరీక్షలు ఎలా రాస్తారని ఆయన ప్రశ్నించారు. జీవో 29పై ప్రభుత్వం పునరాలోచన



చేయాలని ఆయన సూచించారు. మహిళల్ని, గర్భిణీలను పోలీసులు కొడుతున్నారని, ఇది దాష్టీకానికి నిదర్శనమని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.



# పెట్టుబడికి 'రియల్' విశ్వాసం

విశ్వసనీయమైన పెట్టుబడి మార్గంగా రియల్ ఎస్టేట్ రంగాన్ని భావిస్తున్నారు. చాలామంది నివాసం కోసం ఇళ్లు, భవిష్యత్‌కు భరోసానిచ్చేలా ప్లాట్లను కొనుగోలు చేస్తున్నారు. మంచి రాబడిని ఆశించి రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడి పెడుతున్నారు. దేశంలో 59శాతం కంటే ఎక్కువ మంది భారతీయులు స్థిరాస్తిని అత్యంత నమ్మకమైన పెట్టుబడి అవకాశంగా భావిస్తున్నారని ఫిక్కీ-అనరాక్ చేసిన అధ్యయనంలో తేలింది. ఈ అధ్యయనం ప్రకారం.. 67% కంటే ఎక్కువ మంది సొంత ప్రయోజనాల కోసమే స్థిరాస్తులను కొనుగోలు చేస్తున్నట్లుగా వెల్లడైంది. 33% మంది కొనుగోలుదారులు పెట్టుబడి కోసం ప్రాపర్టీని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దేశంలోని ప్రధాన ఏడు నగరాల్లో ధరలు గణనీయంగా పెరుగుతూనే ఉన్నాయి. కానీ గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం 3% క్షీణించినట్లుగా ఫిక్కీ-అనరాక్ నివేదిక స్పష్టం చేసింది.

## రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులకు జనాల ఆసక్తి
## భవిష్యత్ అవసరాలు, రెంటల్ ఇన్‌కం లక్ష్యంగా ఆస్తుల కొనుగోళ్లు
## రియాలిటీపై 59శాతం మందికి విశ్వాసం
## ఫిక్కీ-అనరాక్ నివేదికలో వెల్లడి

పెట్టుబడికి భరోసా అయితే ఉంది, సంపాదించిన ప్రతి రూపాయి సురక్షితమే కానీ రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడి పెట్టాలంటే రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి కొనుగోలుదారుల నుంచి కొన్నింటిని ఆశిస్తున్నట్లుగా తేలింది. అక్టోబర్ 18న ముంబై వేదికగా జరిగిన ఫిక్కీ రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ సమిట్‌లో హోం బయ్యర్ సెంటిమెంట్ సర్వే- హెచ్1 రెండో ఎడిషన్ విడుదల చేశారు. ఈ సర్వే ప్రకారం సకాలంలో ప్రాజెక్ట్ పూర్తి చేయాలని కోరుకునే వారు 98% మంది ఉండగా, మెరుగైన నిర్మాణ నాణ్యతను కోరుకునే వారు 93%, వెంటిలేషన్, స్వచ్ఛత కలిగిన పరిసరాలలో స్వగృహాలను కోరుకునేవారు 72% శాతం మంది ఉన్నారు. ఇవే చాలా మంది స్థిరాస్తి కొనుగోలుదారుల ప్రధానంగా ఆశిస్తున్నట్లుగా తేలింది. ఈ ఫిక్కీ సర్వేలో పాల్గొన్నవారిలో 67% కంటే ఎక్కువ మంది స్వీయ-ఉపయోగం కోసమే స్థిరాస్తులను కొనుగోలు చేస్తున్నారని తేలగా... రెంటల్ ఇన్ కం, పెట్టుబడి మాధ్యమంగా రియల్ ఎస్టేట్ రంగాన్ని ఎంచుకునే వారు ఎక్కువ మందే ఉన్నారు.



### దక్షిణాదిలో ఓపెన్ ప్లాట్లకే ఆదరణ...

మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాలకు చెందిన వారు అత్యధికంగా అపార్టుమెంట్లలలో ఫ్లాట్లను ఇష్టపడుతున్నారు. అపార్టుమెంట్ ఫ్లాట్లలను కొనేందుకు 58% ఆసక్తి చూపుతున్నారు. అయితే దక్షిణాది నగరాల్లో మాత్రం రెసిడెన్షియల్ ఓపెన్ ప్లాట్లను కొనుగోలు చేసేందుకు మొగ్గుచూపుతున్నారని, భవిష్యత్ అవసరాల కోసమే వీటిలో పెట్టుబడి పెడుతున్నారని తేలింది. రియల్ ఎస్టేట్ రంగంలో కొనుగోలు చేసేవారిలో 20శాతం మందికి వీటిలో పెట్టుబడులు ఉన్నాయని నివేదిక ద్వారా తెలిసింది. ఇక నగరాల వారీగా చూస్తే దక్షిణాది నగరాల్లో రెసిడెన్షియల్ ప్లాట్లకు ఎక్కువ ప్రాధాన్యత ఉంది. గత కొన్నేళ్లుగా అనేక పెద్ద, బ్రాండెడ్ డెవలపర్లు ఈ దక్షిణాది నగరాల్లో రెసిడెన్షియల్ ప్లాట్ ప్రాజెక్టులను విస్తృతంగా అందుబాటులోకి తీసుకువస్తున్నాయని వెల్లడైంది. దక్షిణాది నగరాల్లో విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నట్లు సర్వేలో తేలింది.

### పెట్టుబడి కోసం...

పెరుగుతున్న స్థిరాస్తి ధరల కారణంగా స్వీయ ఉపయోగం కోసం కాకుండా పెట్టుబడి కోణంలో ప్రాపర్టీని కొనుగోలు చేసే భాగస్వాముల శాతం 3 శాతం వరకు తగ్గింది. కానీ 33 శాతం మంది కొనుగోలుదారులు పెట్టుబడి దృక్పథంతో ప్రాపర్టీని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారని తేలింది. అయితే స్థలం, నిర్మాణ నాణ్యత, యూనిట్ పరిమాణాలకు సంబంధించిన సమస్యల కారణంగా 53% కంటే ఎక్కువ మంది గృహ కొనుగోలుదారులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. 8.5% కంటే తక్కువ గృహ రుణ వడ్డీ రేట్లు, 71% మంది కొనుగోలు నిర్ణయాలపై సానుకూల ప్రభావాన్ని చూపుతాయని సర్వే పేర్కొంది. అయితే 9% కంటే ఎక్కువ వడ్డీ రేట్లు కొనుగోళ్లను ప్రేరేపిస్తున్నాయని తేలింది. 8.5 శాతం నుంచి 9 శాతం మధ్య వడ్డీ రేటు ఉంటే తమ ఎంపికపై ఓ మోస్తరు ప్రభావం ఉంటుందని 54 శాతం మంది చెప్పారు.

## కొనుగోలుదారులు ఆశిస్తున్నది ఇవే...

**విశాలభారతి, హైదరాబాద్ :**
గ్లోబల్ మార్కెట్ ప్రభావం లేదు. అంతర్గత రాజకీయాలతో ధరలు పడిపోయే అవకాశమే లేదు. ఇక సంపాదించిన ప్రతి రూపాయి కళ్ల ముందర కనిపించే రియల్ ఎస్టేట్ రంగానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యతనిస్తున్నారు. అదే తరతరాలుగా ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేలా చేస్తోంది. దేశంలోని ప్రధానమైన ఏడు మెట్రో నగరాల్లో రియల్ ఎస్టేట్ సెంటిమెంట్, కొనుగోలుదారుల ఆసక్తి, పెట్టుబడికి భరోసా, ధరల పురోగతి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అధ్యయనం చేయగా... రియల్ ఎస్టేట్ రంగాన్ని అంచనా వేసేలా, కొనుగోలుదారుల అభిరుచులను ప్రతిబింబించేలా నివేదికను రూపొందించింది.

**అప్‌గ్రేడ్ అవుతున్నరు..**
మారిన ఆర్థిక, సామాజిక, కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో... సొంతింటి విషయంలోనూ కొనుగోలుదారులు ఒక్క అడుగు ముందుకు వేస్తున్నారు. ఈ క్రమంలో రెడీ టూ మూవ్ ఇండ్ల కంటే ధర తగ్గుతుందని భావించి నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను కొనేందుకు జనాలు ఇష్టపడుతున్నారు. దీంతో రెడీ టూ మూవ్ ఇండ్లకు డిమాండ్ తగ్గినట్లుగా చెబుతున్నారు. 2020 తొలి ఆరు నెలలలో రెడీ టూ మూవ్, న్యూ లాంచ్ ప్రాజెక్టుల నిష్పత్తి 46:18గా ఉంటే... ఈ ఏడాదిలో 20:25 నిష్పత్తిలో ఉంది. ఇక సర్వేలో పాల్గొన్న వారిలో విశాలమైన ఇండ్లకు ఆసక్తి పెరుగుతుందని, ఇందులో 51% మంది 3బిహెచ్ కె యూనిట్లను ఇష్టపడుతున్నారని తేలింది. రూ.45 లక్షల నుంచి రూ. 90 లక్షల బడ్జెట్ రేంజ్‌లో 35% కంటే ఎక్కువ మంది గృహ కొనుగోలుదారులు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. అదే సమయంలో ప్రీమియం, లగ్జరీ గృహాలకు విశేషమైన ఆదరణ వస్తుందని, ప్రాజెక్టుల్లోనూ గణనీయమైన డిమాండ్ పెరుగుతుందని, కనీసం 45 శాతం మంది రూ.90 లక్షల కంటే ఎక్కువ ధర కలిగిన ఇండ్లను కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

**రెంటల్ ఇన్‌కం కోరుకుంటూ...**
ప్రస్తుత పరిస్థితుల్లో అదనపు అదాయం అనేది ప్రతి కుటుంబానికి అత్యంత కీలకంగా మారింది. పెరుగుతున్న ఖర్చులు, నిత్యావసర అధిక ధరలతో ఒక్క జీతం, సంపాదనపై ఆధారపడి కుటుంబాలను పోషించుకునే వీల్లేకుండా పోతుంది. ఈ క్రమంలో అదనపు ఆదాయ వనరులను అన్వేషించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. కొందరూ ఫ్రీ లాన్సింగ్, పార్ట్ టైం ఉపాధి అవకాశాలను వెతుకుతుంటే.. పెట్టుబడి పెట్టే స్తోమత కలిగిన వారు రెంటల్ ఇన్‌కం వచ్చే స్థిరాస్తులను కొనుగోలు చేస్తున్నారు. స్థిరమైన ఆదాయాన్ని పొందే లక్ష్యంతో రెంటల్ ప్రాపర్టీలను కొనుగోలు చేసే వారి సంఖ్య భారీగా పెరిగింది. గత రెండేళ్లలో ప్రధాన నగరాల్లోని ప్రముఖ మైక్రో మార్కెట్లలో అద్దె విలువలు 70 శాతం వరకు పెరగడం కూడా పెట్టుబడిదారులు ఆకర్షితులు కావడానికి ప్రధాన కారణంగా మారింది. కొంతమంది ఇన్వెస్టర్లు భవిష్యత్తు వ్యవస్థాపక వృద్ధి కోసం క్యాపిటల్ గెయిన్స్ ఉండేలా రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెడుతుంటే, మరి కొంతమంది ఎమర్జెన్సీ ఫండ్ కోసం స్థిరాస్తిలో పెట్టుబడులు పెడ్తున్నారు. మెజార్టీ నగరాల్లో సొంతింటిలో ఉంటూ... అదనపు ఆదాయ వనరులు కోరుకునే వారిని రెంటల్ అసెట్స్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. దీనికోసం జనావాసాల్లో ఉండే రెసిడెన్షియల్, వాణిజ్య కేంద్రాల్లో ఉండే కమర్షియల్ బిల్డింగ్‌లపై, ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉండే ఓపెన్ ప్లాట్లను కొనుగోలు చేసుకుని రెంటల్, లీజ్ ప్రతిపాదికన రెంటల్ ఇన్‌కం పొందుతున్నారు. అయితే అధిక ధరల నేపథ్యంలో మార్కెట్లోకి వచ్చేందుకు కొంతమంది పెట్టుబడిదారులు ఇప్పటికీ వెనుకడుగు వేస్తున్నారు.

**హైదరాబాద్‌లో భిన్నమైన పరిస్థితులు...**
రియల్ ఎస్టేట్ రంగానికి గడిచిన దశాబ్ధ కాలం స్వర్గధామంలా నిలిచింది. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు స్థానిక పెట్టుబడిదారులే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలు, ప్రతినిధులు, కంపెనీలు కూడా ముందుకు వచ్చాయి. ఈ క్రమంలో రియల్ ఎస్టేట్ రంగం రాకెట్ వేగంతో దూసుకుపోయింది. ఎకరం వంద కోట్లకు విక్రయించే స్థాయికి హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం ఎదిగింది. కానీ గడిచిన ఏడాది కాలంలో హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. దేశవ్యాప్తంగా రియాలిటీ సెంటిమెంట్ కొనసాగితే, ఇక్కడ మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ముఖ్యంగా తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలతో రియల్ ఎస్టేట్ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. హైదరాబాద్ బ్రాండ్‌ను కొనసాగించేలా గత ప్రభుత్వం తరహాలో పెట్టుబడులను ఆకట్టుకోలేక పోవడం, సీఎం రేవంత్ రెడ్డిపై జనాల్లో విశ్వసనీయత పెరగకపోవడం, ఫోర్త్ సిటీ, ఎయిర్‌పోర్టు మెట్రో రద్దు, హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట కూల్చివేతలు, దెబ్బతిన్న ఈజ్ ఆఫ్ డూయింగ్ పాలసీ విధానాలతో రియల్ ఎస్టేట్ రంగం క్రమంగా సంక్షోభంలోకి కూరుకుపోతుంది.




# అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

**వాజేడు, విశాలభారతి:** మండల కేంద్రం పరిధిలోని పెద్ద గంగారం గ్రామానికి చెందిన ఆలం ఆంజనేయులు, ధనలక్ష్మిల కుమార్తె ఆలం స్వప్న 22 సంవత్సరాలు అనే యువతి అనుమాన స్పందన స్థితిలో మృతి చెందిన సంఘటన గ్రామంలో చోటుచేసుకుంది. తండ్రి అయిన ఆలం ఆంజనేయులు ఫిర్యాదు మేరకు పేరూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేరూరు ఎస్సై కృష్ణ ప్రసాద్ తెలిపారు.

# ప్రతీ రైతుకు పట్టాలు అందజేస్తాము

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**అడవిదేవులపల్లి, విశాలభారతి:** మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మండలంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతు వేదిక నందు అధికారులతో కలసి ఇప్పటివరకు ప్రజా పాలనలో సేకరించిన దరఖాస్తుల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని విభాగాల అధికారులకు వచ్చిన ఫిర్యాదులు ఇప్పటివరకు పరిష్కరించిన సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ రోజు మండలంలోని ఏదో ఒక గ్రామ పంచాయితీ కార్యాలయాలలో అకస్మిక తనిఖీలు నిర్వహిస్తాము. అధికారులు లేకపోతే తక్షణమే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామాల్లో రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలి అని అన్నారు రైతుల సమస్యలు ఏది ఉన్నా తక్షణమే పరిష్కారం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యాలయంలోనో లేక మండల కార్యాలయంలో పరిష్కారం జరగాలి గానీ వారు క్యాంప్ కార్యాలయం వరకు, జిల్లా కేంద్రం వరకు వెళ్ళే విధంగా వారిని ఇబ్బంది పెట్టకూడదు అని హెచ్చరించారు. అనంతరం డిసిసి అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు స్కైలాబ్ నాయక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్ మరియు మండల పార్టీ ప్రసిడెంట్ రమావత్ బాలు నాయక్ తో కలసి ప్రజలతో, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి వారి నుంచి ఫిర్యాదులు సేకరించారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# మెప్మాలో బాధితురాలకు న్యాయం చేయాలి

- మహిళా సమైక్య డిమాండ్

**మణుగూరు, విశాలభారతి:** మున్సిపాలిటీ పరిధిలోని మెప్మాలో పనిచేసిన పి శ్రీదేవికి న్యాయం చేయాలని మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా మున్సిపాలిటీ మెప్మాలో తనకు అన్యాయం జరిగిందని తనకు రావాల్సిన డబ్బులు తనకి ఇప్పించాలని డిమాండ్ చేస్తూ గత 28 రోజులుగా మణుగూరు మున్సిపాలిటీ ఎదురుగా రిలే దీక్ష చేస్తున్నటువంటి శిబిరాన్ని మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, మండల అధ్యక్ష కార్యదర్శులు బొలగాని సమ్మక్క ,దుబ్బాక నిర్మల, ప్రమీలలు శనివారం నాడు సందర్శించి ఆమెతో మాట్లాడారు. మున్సిపాలిటీలో గాంధీనగర్లో మెప్మ లోపని ఆర్ పి గా చేసే వ్యక్తి ఎవరో చనిపోయారని, ఆమెను ఆమె ప్లేస్ లో పని చేయాలని చెప్పి చేయించారని, నాకు తెలియకుండానే కొంతమంది డబ్బుల విషయంలో తనను ఇరికించారని, నా దగ్గర నుంచి లక్ష పది వేల రూపాయలు కట్టించుకున్నారని అన్నారు. ఈ విషయమై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయగా వారు విచారణ చేసి ఆమె డబ్బులు ఆమెకి ఇవ్వాలని, సూచించారని ,అయినా ఇంతవరకు నాకు రావాల్సిన డబ్బులు నాకు ఇవ్వలేదని, అందుకే నాకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

- మణుగూరు మండల అధ్యక్షులు పీరినాకి నవీన్



**మణుగూరు, విశాలభారతి:** మండలంలోని రామానుజవరం నుండి గొల్లకొత్తూరు,పగిడేరు మరియు సాంబాయిగూడెం నుండి పగిడేరు గ్రామాలను కలిపే వాగులపై హై లెవల్ బ్రిడ్జిలా నిర్మాణం కొరకు కోటి యాభై లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు మండల ప్రజల తరపున మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పీరినాకి నవీన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం అభివృద్దే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. ప్రజల అవసరాలను తెలుసుకొని పని చేయడమే ఎమ్మెల్యే నైజం అని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యానికి మణుగూరు మండలం అభివృద్ధికి నోచుకోలేదని ఆయన అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అంతర్గత రహదారులు, కలవర్టులు శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతున్నాయని వాటి మరమ్మతులకు, నూతన నిర్మాణాలకు ప్రత్యేకించి సంబంధిత అధికారులతో మాట్లాడి నిర్మాణ పనులకు నిధులు కేటాయించి నిర్మాణ పనులు చేపడుతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నాయకత్వంలో 10 నెలలుగా ప్రజలు నేరుగా వారి కష్ట సుఖాలను చెప్పుకొని ప్రశాంతంగా ప్రజల సమస్యలను తీర్చుకుంటున్నారని ఆయన అన్నారు. గత పాలకుల హాయంలో ప్రజలు ఎమ్మెల్యేను కలవాలంటేనే భయభ్రాంతులకు గురయ్యే వారిని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో స్వేచ్ఛగా ప్రజలు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వద్దకు వచ్చి వారి సమస్యలను నేరుగా చెప్పుకోవడం జరుగుతుందని అనేక సమస్యలతో వస్తున్న ప్రజలకు భరోసాగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నిలుస్తున్నారని ఇది ఎమ్మెల్యే పాయం గొప్పతనమని కొనియాడారు.




# ప్రజా సంక్షేమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు
- డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు

**తుంగతుర్తి, విశాలాభారతి:** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, రైతుల అభివృద్దే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మండలంలో డిసిసిబి డిసిఎంఎస్ డైరెక్టర్, తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ ఆదేశానుసారం మండల కేంద్రంలోని వెలుపల్లి, దేవుని గుట్ట తండా, వెంపటి, గొట్టిపర్తి, తుంగతుర్తి, కొత్తగూడెం, గానుగుబండ, గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులకు మద్దతు ధరతో పాటు సన్నాలకు 500 బోనస్ అందిస్తూ రైతులను రాజు చేయడమే లక్ష్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ కొనుగోలు కేంద్రాలలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో రైతు సంక్షేమ ప్రభుత్వంగా పనిచేస్తుందన్నారు. అందులో భాగంగానే రైతులకు సన్న రకం ధాన్యానికి క్వింటాల్ కురూ. 500 రూపాయలు బోనస్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ పి దయానంద్, ఎంపీడీవో శేషు కుమార్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ గోవింద్,రెవిన్యూ ఇన్స్పెక్టర్లు రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, ఏఈఓలు జోష్న, మహితా రెడ్డి, సీసీ గడ్డం గిరి, ఇన్చార్జి సిసి నర్సింగ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొంగరి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుతో మహిళ మృతి



**అడవిదేవులపల్లి, విశాలభారతి:** పిడుగుపాటుకు మహిళా మృతి చెందిన ఘటన అడవిదేవులపల్లి మండలంలోని మొల్కచర్లలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాలాజీ తండాకు చెందిన జటావత్ నాగమణి పొలంలో కలుపు తీస్తుంది ఉరుములు మెరుపులతో వర్షం ప్రారంభమైంది అందరూ ఇంటికి వెళుతుండగా బాల్నేపల్లి సబ్ స్టేషన్ దగ్గరకు రాగానే ఒక్కసారిగా పిడుగు పడింది దీంతో నాగమణి అక్కడికి అక్కడే చనిపోయింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ వెల్లడించారు.



# గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలి

- మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్నేని వెంకటరత్నం బాబు

**కోదాడ, విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తొలి నుంచి సేవలందించే వారికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలు న్యాయం చేస్తున్నారని మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్నేని వెంకటరత్నం బాబు అన్నారు. శనివారం ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్టణ అధ్యక్షులు వంగవీటి రామారావుకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా నియామకమైన సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి వారిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రామారావు మొదటి నుంచి పార్టీ కోసం నిరంతరం కృషి చేశాడని వారి సేవలను గుర్తించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి న్యాయం చేశారని కొనియాడారు. గ్రంథాలయ చైర్మన్ గా జిల్లాలో ఉన్న అన్ని గ్రంథాలయాలతో పాటు కోదాడ గ్రంథాలయాన్ని అభివృద్ధి చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలి అన్నారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన పదవులను అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వంటి పులి వెంకటేష్, చందు నాగేశ్వరరావు, నెమ్మాది దేవమణి, లైటింగ్ ప్రసాద్, కాజా మోహినిద్దీన్, వేలాద్రి, సైదిబాబు, వేమూరి విద్యాసాగర్, మైలారిశెట్టి భాస్కర్, ముస్తఫా, వంటి పులి శ్రీను, మేకపోతుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ఆలేరు మున్సిపల్ అభివృద్ధికీ కాంగ్రెస్ అడ్డు

- మాజీ ఎమ్మెల్యే గోంగిడి సునీతా
- నిధులు సద్వినియోగం పరుచుకోక చేతులెత్తిసిన ఎమ్మెల్యే బీర్ల

**ఆలేరు, విశాలభారతి:** ఆలేరు మున్సిపల్ భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని మాజీ ప్రభుత్వ విప్,గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆలేరులోని గెస్ట్ హౌస్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రివర్యులు కేటీఆర్ తోని పోరాటం చేసి ఆలేరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం స్పెషల్ ఫండ్స్ కింద టీయుఎఫ్ఐడి ద్వారా 15 కోట్లు కేటాయించడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ 15 కోట్లలో మూడు కోట్లు మున్సిపల్ భవన నిర్మాణానికి, పాల కేంద్రం నుండి దుర్గమ్మ గుడి వరకు సిసి రోడ్ నిర్మాణానికి మూడు కోట్లు, పట్టణ కేంద్రంలో డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం 9 కోట్లు, మొత్తం 15 కోట్లు విడుదల చేయడం జరిగిందని ఆమె తెలిపారు. మోయలేని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ శంకుస్థాపన చేసిన మున్సిపల్ భవనాన్ని నిర్మాణాన్ని చేయలేక చేతులెత్తిసి ఆపేసిందన్నారు ఆలేరు మున్సిపల్ కు తీసుకొచ్చిన నిధులతొ భవన నిర్మాణాన్ని చేపట్టలేక ఎందుకు ఆపారో చెప్పాలని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను ప్రశ్నించారు. గొంగిడి సునీతా నిధులు ఉన్నా అభివృద్ధి పనులను చేయలేక పోతున్నారని ఆరోపించారు తన హయాంలో మీట్ మార్కెట్ పనులు అరవై శాతం పూర్తి చేశామని ఇంకా కొన్ని నిధులు కేటాయిస్తే మీట్ మార్కెట్ పూర్తి చేసి వ్యాపారస్తులకు అందుబాటులోకీ తీసుకురావచ్చునని అన్నారు తక్షణమే ఆలేరు మున్సిపల్ విషయంలో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకుంటూ ఇంకా నిధులు కేటాయిచ్చి భాగస్వాములు కావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, మోరిగాడి వెంకటేష్ గౌడ్, కోరుకొప్పుల కిష్టయ్య గౌడ్, కుండే సంపత్, పత్తి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు



# జర్నలిస్ట్ పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- డీఎస్పీకి వినతిపత్రం అందించిన టియుడబ్ల్యూజే నాయకులు

**మణుగూరు, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు మండలంలో జర్నలిస్టుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జర్నలిస్ట్ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. టియుడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా నాయకత్వం పిలుపులో భాగంగా శనివారం మణుగూరు డివిజన్ అధ్యక్షులు మాచర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మణుగూరు సబ్ డివిజనల్ కార్యాలయంలో డిఎస్పీ రవీందర్ రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇల్లందు మండలం ఆదాబ్ హైదరాబాద్ దినపత్రికలో రిపోర్టర్ గా పనిచేస్తున్న నిట్టా సుదర్శన్ పై శుక్రవారం రాత్రి జరిగిన దాడిని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (తెలంగాణ జర్నలిస్ట్ ఫోరమ్) మణుగూరు డివిజన్ నాయకులు తీవ్రంగా ఖండించారు. జర్నలిస్ట్ పై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అంతే కాకుండా ఈ మధ్యకాలంలో జర్నలిస్టులు ఎటువంటి కార్యకలాపాలకు పాల్పడుతున్న కావాలని కేసులు పెట్టె ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వార్తలు సేకరించేందుకు ఏ ప్రాంతానికి వెళ్లిన, అడ్డగోలుగా కేసులు పెట్టి కక్షపూరితంగా వ్యవహరిస్తూ ప్రశ్నించే గొంతుకును నొక్కే ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే జిల్లా నాయకులు కృష్ణ మోహన్, శ్రీహరి, కనుకు రమేష్, రామిరెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షులు దాసరి వెంకట్ , నాయకులు మిట్టపల్లి శ్యామ్, రాజేంద్రప్రసాద్, ఉల్లి రామారావు, పులిపాటి పాపారావు, సత్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# మాజీ అధ్యక్షుడు కుటుంబాన్ని పరమర్శించిన బీఆర్ఎస్ నాయకులు

**పాలకీడు, విశాలభారతి:** ఇటీవల గుండెపోటుతో మరణించిన పాలకీడు మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, మాజీ రైతు సంఘం జిల్లా సభ్యుడు మలమంటి దర్గారావు కుటుంబాన్ని హుజూర్ నగర్ నియోజకర్గ బిఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కిష్టపాటి అంజిరెడ్డి తో కలిసి పరామర్శించారు. దర్గారావు లేకపోవడం పార్టీకి,సమాజానికి తీరని లోటని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని అందించారు. కార్యక్రమంలో దొండపాటి అప్పిరెడ్డి, సురేష్ బాబు, కొప్పుల సైది రెడ్డి,అమర్, చెన్నబోయిన సైదులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరా నిలిపివేత

- ప్రజలందరూ సహకరించాలి
- ఏఈ శ్రీనివాస్



**అడవిదేవులపల్లి, విశాలభారతి;** మండల కేంద్రంలోని ఆదివారం ఉదయం11 గంటల నుండి సాయంత్రం 04 గంటల వరకు అడవిదేవులపల్లి సబ్ స్టేషన్ నందు సత్రశాల ఫీడర్ కొరకు కొత్త బ్రేకర్ ఏర్పాటు చేయుటకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. స్టేషన్ పరిధిలోగల అడవిదేవులపల్లి, ఉల్సాయపాలెం, ముది మాణిక్యం, గొనియా తండా, చాంప్లా వస్త్రం తండా, జీలకర్ర కుంట తండా, హేము తండా, తాటి చెట్టు తండాతండా , వీర్లపాలెం గ్రామాల ప్రజలు సహకరించాలి కోరారు.



# పిడిఎస్యు అర్థ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

**కోదాడ, విశాలభారతి:** పిడిఎస్యు అర్థ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని కోదాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న పూర్వ, ప్రస్తుత విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిడిఎస్యు పూర్వ విద్యార్థి నాయకులు రాయపూడి చిన్ని, పందిరి నాగిరెడ్డిలు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంఎస్ కళాశాలలో ముఖ్య నాయకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనానికి ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసిం ప్రధాన వక్తగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. జార్జిరెడ్డి అమరత్వంతో జంపాల చంద్రశేఖర్, శ్రీపాద శ్రీహరి, రంగవల్లి, మారోజు వీరన్న తదితర విద్యార్థుల ప్రేరణతో పిడిఎస్యు శాస్త్రీయ విద్యా విధానంతో పాటు సామాజిక సమస్యలపై పోరాడిందని పేర్కొన్నారు. వామపక్ష, ప్రజాతంత్ర, ప్రజాస్వామిక వాదులు హాజరై ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పి డి ఎస్ యు పూర్వ, ప్రస్తుత విద్యార్థులు రాఘవరెడ్డి, అప్పి రెడ్డి, నరసింహారావు, ఉదయగిరి, హరి కిషన్ రావు, చందర్రావు, ఉదయ్, వేణు తదితరులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డాక్టర్ దుర్గా భవాని

**పినపాక, విశాలభారతి:** పినపాక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పొట్లపల్లి గ్రామంలో ఆరోగ్య వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో రక్త నమూనాలు సేకరించి డెంగ్యూ, టైఫాయిడ్, పరీక్షలు నిర్వహించడంతోపాటు, ఇంటి పరిసరాలు శుభ్రపరచుకోవాలని తమ సిబ్బందితో కలిసి, ప్రతి ఇంటికి వెళ్లి ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలని వారన్నారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సదస్సు దాని ఆవశ్యకతను తెలియజేశారు. సీజనల్ వ్యాధులైనటువంటి మలేరియా, డెంగ్యూ జబ్బులను నివారించుటకై ప్రజలంతా తమ బాధ్యతగా చైతన్యవంతంతో తమ ఇండ్లలోని గోళాలు, డ్రమ్ములు, ప్లాస్టిక్ డబ్బాలలోని నీటిలో తోక పురుగులు (దోమల లార్వాలు) లేకుండా క్లీన్ చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. గ్రామమంతటా ఫీవర్ సర్వే కండక్ట్ చేయడం జరిగింది అని ఆయన అన్నారు. గ్రామంలో రెండవ విడత దోమల మందు పిచ్చుకరి నిర్వహించి ప్రతి ఇంటి లోపల పిచికారి చేశారు. ప్రభుత్వ వైద్యశాలల అన్ని రకాల జబ్బులకు రక్త పరీక్షలు నిర్వహించబడతాయని, ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా బోడ అరుణ్ కుమార్

- నియమక పత్రం అందజేసిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**శాలిగౌరారం, విశాలభారతి:** అడ్లూరు గ్రామానికి చెందిన బోడ అరుణ్ కుమార్ శాలిగౌరారం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా నియమితులయ్యారు. బోడ అరుణ్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి దశ నుంచే పార్టీ బలోపేతం కోసం పని చేశారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో, ఇటీవలె జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రచార కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోడ అరుణ్ కుమార్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, రాబోయే స్థానిక సంస్థ ల ఎన్నికల్లో మండల వ్యాప్తంగా గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. తన పై నమ్మకంతో నన్ను ఎస్సీ సెల్ అధ్యక్షులుగా నియమించినందుకు జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ నాగరిగారి ప్రీతం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బోడ స్వామి, శాలిగౌరారం మండల కమిటీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



## అనాథ పిల్లలకు నిత్యావసర సరుకులు పంపిణీ

- యూట్యూబర్ రఘు
- నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి

**కురవి, విశాలభారతి:** ఇబ్బందులలో ఉన్న అనాథ పిల్లలకు నేనున్నా అని నిత్యవసర సరుకులు అందించి చేయూతనందించిన యూటూబర్ రఘు అభినందనీయుడని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. కురవి శివారులోని సిపిఐ కాలనీలో యూట్యూబర్ రఘు, దాత శ్రీకాంత్ రెడ్డి కుమారుడైన సిద్ధాంత రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి, వారి సహకారంతో తండ్రి తల్లి లేని ఇద్దరు చిన్నారులను తన దగ్గర సాకుతుండగా వారిని పోషించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న వృద్ధురాలైన వాగుల పుల్లమ్మకు రెండు నెలల నిత్యవసర వస్తువులను అందించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ యూట్యూబర్ రఘు ఎక్కడ ఎవరికి ఇబ్బందులు వచ్చినా వారి సమస్యలను దాతలకు చేరవేసి వారి సహాయ సహకారాలతో పేద అనాథలను ఆదుకోవడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సహాయకారిగా ఉంటుందని, వీరికి నిత్యవసర వస్తువులే కాక ఇతర దాతలచే పిల్లలకు కొత్త దుస్తులు గ్యాస్ సిలిండర్ అందిస్తానని మాట ఇవ్వడం అభినందనీయమని అన్నారు. సిపిఐ కురవి గ్రామ కార్యదర్శి తురక రమేష్ కురియాల వీరన్న, వెంకటమ్మ సరస్వతి గట్ల విజయ నందిగామ జానకి వీరన్న తదితరులు పాల్గొన్నారు.



## కష్టపడి పని చేసే వారిని పార్టీ గుర్తిస్తుంది

- టీపీసీసీ సోషల్ మీడియా సమావేశం
- పాల్గొన్న పాలకుర్తి సభ్యులు

**హైదరాబాద్, విశాలభారతి:** టీపీసీసీ సోషల్ మీడియా స్టేట్ కోఆర్డినేటర్ పెట్టాం నవీన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సోషల్ మీడియా సమావేశం గాంధీ భవన్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో పాలకుర్తి ఎమ్మెల్యే హనుమాండ్ల యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ సోషల్ మీడియా సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేట్ కోఆర్డినేటర్ పెట్టాం నవీన్ మాట్లాడుతూ.. జిల్లా, మండల, గ్రామ కోఆర్డినేటర్ లు ఇంతకముందు లాగా ఇప్పుడు కూడా బాగా పని చేయాలి, కష్టపడి పనిచేసిన వారిని పార్టీ గుర్తిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టే పథకాలలోనూ ఫస్ట్ ప్రయార్టీ కల్పించే బాధ్యత నేను తీసుకుంటాను అని తెలిపారు. కార్యక్రమం లో స్టేట్ సెక్రటరీ పెండ్యాల వంశీ కృష్ణ, స్టేట్ సెక్రటరీ అంబాలా శివకుమార్, పాలకుర్తి కోకోఆర్డినేటర్ గంధం సతీష్, పెద్దవంగర మండల కోఆర్డినేటర్ ఎరుకల సమ్మయ్య గౌడ్, కొడకండ్ల కోఆర్డినేటర్ బత్తుల వెంకన్న, పాలకుర్తి కోఆర్డినేటర్ సంపత్ రెడ్డి, వివిధ జిల్లా, మరియు మండలాల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

- రూ. 35 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- కొంగర కలాన్ లోని 14 వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలు
- శంకుస్థాపన చేసిన ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ చైర్పర్సన్ కొత్త ఆర్థిక ప్రవీణ్ గౌడ్





**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** ఆదిభట్ల మున్సిపాలిటీలోని కొంగర కలాన్ 14 వ వార్డులో రూ. 35 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సీసీ రోడ్డు పనులకు ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ చైర్ పర్సన్ కొత్త ఆర్తిక ప్రవీణ్ గౌడ్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో గ్రామాలకు , మున్సిపాలిటీ లకు మహర్దశ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ పాలకుల చేతుల్లో గత పది సంవత్సరాలు నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురైన అనేక గ్రామాలు కాంగ్రెస్ పాలనలో క్రమక్రమంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ , డిఈ స్వరన్ కుమార్ , బీజేపీ నాయకుడు పండల లక్ష్మీపతి గౌడ్ , నర్శగాల్ల జంగయ్య, దేవరపల్లి రమేష్, దండిగా రాజు, పాశం భాస్కర్, నీళ్ళ మనిధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు



## మియాపూర్ లో సంచరించింది చిరుత కాదు

- మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలో సంచరించింది అడవి పిల్లి...
- మొన్న మియాపూర్ మెట్రో స్టేషన్ పరిధిలో చిరుత సంచరిస్తున్నట్లు వీడియో వైరల్..
- అడవి పిల్లిగా తేల్చిన అధికారులు
- ఊపిరి పీల్చుకున్న స్థానికులు.

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలో చిరుత సంచారం కలకలం రేపిన విషయం తెలిసిందే. చిరుత సంచరిస్తోందని తెలుసుకున్న స్థానికులు భయాందోళనకు గురయ్యారు. చిరుత సంచరిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీంతో వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన పోలీసులు, అటవీ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని ఆనవాళ్లు గుర్తించారు. మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలో సంచరించింది అడవి పిల్లిగా అటవీశాఖ అధికారులు తేల్చారు. అక్కడ సంచరించింది చిరుత కాదని అడవి పిల్లి అని నిర్ధారించారు. దీంతో మియాపూర్ వాసులు భయాందోళన గురికావల్సిన పనిలేదని తెలిపారు. ఇలాంటి వీడియో ఒకటి రెండు సార్లు పరిశీలించిన తరువాత సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని సూచించారు. ఇలాంటి వీడియోలతో ప్రజలు భయ భ్రాంతులు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు.



## ఆదిభట్ల అభివృద్ధికి మరో అడుగు

- రూ. 65 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం
- సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించిన ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** ఆదిభట్ల అభివృద్ధికి మరో అడుగులు పడ్డాయి. ఆదిభట్ల మున్సిపాలిటీలోని 1,13,14 వార్డులలో మున్సిపాలిటీ నిధుల నుండి రూ. 65 లక్షల వ్యయంతో చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి శనివారం సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డిమాట్లాడుతూ.. ఆదిభట్ల మున్సిపాలిటీ అభివృద్ధి తన లక్ష్యమని దశలవారీగా మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు తన శాయశక్తుల కృషి చేస్తున్నానని తెలిపారు, మున్సిపాలిటీ పరిధిలో విడతల వారీగా నిధులను కేటాయించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నల్లవోలు లావణ్య పాండురంగారెడ్డి, మర్రి అర్చన రామ్ రెడ్డి, కమిషనర్ బాలకృష్ణ, ఇబ్రహీంపట్నం మాజీ జడ్పిటిసి పొట్టి ఐలయ్య, ఆదిభట్ల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌని బాలరాజ్ గౌడ్, బొంగ్లూర్ మాజీ సర్పంచ్ పల్లె గణేష్ గౌడ్, నాయకులు పయిళ్ల శ్రీనివాస్ రెడ్డి, డిఈ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## దసరా సమ్మేళనానికి తరలిరండి

- సమ్మేళనానికి మాజీ మంత్రులు కేటీఆర్, సబిత ఇంద్రరెడ్డి రాక
- నందివనపర్తి మాజీ సర్పంచ్ వర్త్యావత్ రాజు నాయక్



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి :** నేడు నిర్వహించే దసరా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ నేత , నందివనపర్తి మాజీ సర్పంచ్ వర్త్యావత్ రాజు నాయక్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. యాచారం మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు , ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే దసరా సమ్మేళనానికి బొంగుళూరులోని ప్రమిద కన్వెన్షన్ వేదిక కానుందని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి విచ్చేస్తున్నరని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నియోజవర్గ యువజన విద్యార్థి విభాగ అధ్యక్ష కార్యదర్శులు, మండల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.



## పారిశుద్ధ్య కార్మికుల శ్రమ ఎంతో గొప్పది

- పారిశుద్ధ్య కార్మికులకు నిత్యవసర సరుకుల పంపిణీ చేసిన వాలా హరీష్ రావు

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** మానవసేవే మాధవ సేవ అన్న నానుడిని స్ఫూర్తిగా భావించి తమకు తోచిన రీతిలో ఇతరులకు సహాయం చేయడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాల్సిన అవసరం ఉందని హాఫీస్ పెట్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ గౌరవ అధ్యక్షులు వాలా హరీష్ రావు అన్నారు. జిహెచ్ఎంసి పారిశుద్ధ కార్మికులకు నిత్యవసర వస్తువులు వాలా హరీష్ రావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ మేరకు శనివారం మదీనాగూడ రామకృష్ణ నగర్ లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో వాల హరీష్ రావు జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్మికులకు నిత్యవసర వస్తువుల కిట్టును పంపిణీ చేసి వారిని ఘనంగా సత్కరించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వాల హరీష్ రావు మాట్లాడుతూ నిత్యం పరిసరాల పరిశుభ్రతతో పాటు మన ఆరోగ్య భద్రత విషయంలో పాటుపడుతున్నా పరిశుద్ధ కార్మికులను గౌరవించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం తమ ప్రాణాలను లెక్క చేయకుండా వారి విధుల్లో భాగంగా మెరుగైన సేవలను అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికుల నిత్యావసరాల కిట్టు పంపిణీ సహదాతలు షేక్ మీరావలి, రసూల్, బాబు మోహన్ మల్లేష్, ఉమామహేశ్వరరావు, కృష్ణారావు, విష్ణు రెడ్డి, లక్ష్మణ్ నాయుడు, భాను ప్రకాష్, రాము, గణేష్ రెడ్డి, మల్లేష్ యాదవ్, రంగారావు, ఆనందరావు, వీరభద్ర రావు, కేశవరావు, కాలనీ సభ్యులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు.

## వ్యభిచార గృహం నిర్వాహకుల అరెస్టు



**పటాన్ చెరు, విశాలభారతి** వ్యభిచార గృహం నిర్వహిస్తున్న ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పటాన్ చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్కుల్ గ్రామంలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలియడంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా నెల్లూరు జిల్లా హరినాధపురంకు చెందిన సాయి కృష్ణారెడ్డి అలియాస్ సాయి రెడ్డి, నాగేశ్వరరావు బెంగాల్ నుంచి ఒక యువతిని తీసుకొని వచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలిసింది. సాయి కృష్ణారెడ్డి, నాగేశ్వరావుతో పాటు ఓ యువతిని అదుపులోకి తీసుకున్నారు. యువతిని జిల్లా మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిహబిలిటేషన్ సెంటర్ కు తరలించారు. సాయి కృష్ణ, నాగేశ్వరావు గతంలో కూడా వ్యభిచార గృహాలు నిర్వహించేదంతో అమీన్ పూర్, పటాన్ చెరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదయి ఉన్నాయని తెలిపారు.

## క్లినాక్సి సొల్యూషన్ కు ఇండియన్ ఫార్మసిటికల్ అసోసియేషన్ అవార్డు




**విశాలభారతి, కూకట్ పల్లి:** నిరుద్యోగ యువతకు నిష్ణాతులైన మేధావులచే శిక్షణ ఇచ్చే క్లీనాక్సి సొల్యూషన్స్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ కు ఇండియన్ ఫార్మసిటికల్ అసోసియేషన్ గుర్తింపు లభించింది. ఇండియన్ ఫార్మాసుటికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ టీ.వీ. నారాయణ చేతుల మీదుగా క్లినాక్షి సొల్యూషన్స్ చైర్మన్ వేమవరపు సతీష్ కుమార్ అవార్డును అందుకున్నారు. మైక్రో బయాలజీ కెమిస్ట్రీ ఫార్మసీ బయోటెక్నాలజీ నర్సింగ్ డెంటల్ అగ్రికల్చర్ రంగాలతో పాటు ఇతర విభాగాల్లో విద్యనభ్యసించిన విద్యార్థులకు మేధావుల చే శిక్షణ ఇప్పించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వారధిగా పనిచేస్తుంది క్లీనాక్సి సొల్యూషన్స్. దీనిని గుర్తించిన ఇండియన్ ఫార్మసిటికల్ అసోసియేషన్ అవార్డు ఇచ్చి గుర్తింపునిచ్చింది. ఈ సందర్భంగా క్లినాక్సి సొల్యూషన్స్ చైర్మన్ వేమవరపు సతీష్ కుమార్ మాట్లాడుతూ వివిధ కళాశాలలో విద్యనాభ్యసించిన విద్యార్థులకు నిష్ణాతులైన అధ్యాపక వర్గంతో శిక్షణ ఇప్పించి శిక్షణలో భాగంగా సెమినార్స్ ప్రత్యేకంగా వర్క్ షాపులు నిర్వహించి క్యాంపస్ రిక్రూట్మెంట్ లో సెలెక్ట్ అయ్యే విధంగా తాము చేస్తున్న కృషికి ఇండియన్ ఫార్మసిటికల్ అసోసియేషన్ అవార్డు తమ సంస్థకు ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.



# సురేష్ గౌడ్ ను పరామర్శించిన ఉప్పల వెంకటేష్

**కల్వకుర్తి విశాల భారతి** కల్వకుర్తి మండల పరిధిలోని తర్నికల్ గ్రామానికి చెందిన రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు, బిఆర్ఎస్ పార్టీ నాయకుడు తాళ్ల సురేష్ గౌడ్ ఇటీవలే ప్రమాదవశాత్తు బైక్ ప్రమాదం లో గాయపడి హైదరాబాద్లోని బృంగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సురేష్ గౌడ్ ను ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని అధైర్య పడద్దని సూచించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులకు చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు కనుక సత్యనారాయణ, తాళ్ల వెంకటయ్య, దారమోని గణేష్, ఖాజా, బుచ్చిబాబు తదితరులు ఉన్నారు.



# లైసెన్సు ఉన్న డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలి

- మండల వ్యవసాయ అధికారి వెంకటేష్

**ధర్పల్లి, విశాల భారతి:** ధర్పల్లి మండల కేంద్రంలో గల రైతు వేదిక లో విత్తనాలు ఎరువులు, పురుగు మందుల డీలర్లకు యాసంగి పంట విత్తనాల సరాపర పై మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని ఆదేశించారు.రైతులు లైసెన్సు ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, వారు కొనుగోలు చేసిన విత్తనాలకు డీలర్ నుండి రసీదు తీసుకోవాలని ఆ రసీదును పంట కాలం ముగిసే వరకు తన వద్ద ఉంచుకోవాలని సూచించారు. అదే విధంగా గ్రామాల్లో ఎవరైనా లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మిన సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని విత్తన డీలర్లు, ఏఈఓ లు తదితరుల పాల్గొన్నారు.



# తెలంగాణ ప్రజలను రేవంత్ సర్కార్ నమ్మించి మోసం చేసింది

- కడ్తాల్ బీఆర్ఎస్ పార్టీ

**ఆమనగల్లు, విశాలభారతి:** రేవంత్ సర్కార్ తెలంగాణ ప్రజలను నమ్మించి నట్టేట ముంచిందని కడ్తాల్ బీఆర్ఎస్ మండల పార్టీ ఆరోపించింది. కడ్తాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కంబాలపల్లి పరమేష్, మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఎలక్షన్ల ముందు అధికారంలోకి రావడంకోసం అమలుకానీ హామీలను ప్రకటించి, తెలంగాణ ప్రజలను మోసం చేయాలని ఉద్దేశంతోనే మోసపూరిత రాజకీయాలకు తెరలేపి రేవంత్ అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతుల నడ్డి విరిచే కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చి దాదాపు సంవత్సరం గడుస్తున్న రైతుబంధు వేయకుండా ఆ పథకానికి మంగళం పాడే కార్యక్రమం చేస్తుందని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీ ల పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ ఒక్క హామీని కూడా సరిగా నెరవేర్చలేదని, అనుభవం లేని గుంపు మేస్త్రీ కి అధికారం ఇస్తే తెలంగాణ ప్రజలను ఆగమాగం చేస్తున్నారని మండిపడ్డారు. హామీలు అమలు చేయని రేవంత్ సర్కార్ పై త్వరలోనే భారీ ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, రైతు కోఆర్డినేటర్ వీరయ్య, డైరెక్టర్లు సేవ్య నాయక్, వెంకటేష్, మాజీ ఎంపీటీసీలు ప్రియా రమేష్, మంజుల చంద్రమౌళి, మాజీ సర్పంచులు లోకేష్ నాయక్, నర్సింహా గౌడ్, సులోచన సాయిలు, రైతు సమితి సభ్యులు నరసింహ, బాలకృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షులు రామకృష్ణ, పాండు, యాదయ్య నాయకులు గంప శీను,పంతు,లింగం, రమేష్, మహేష్, పొట్టి శీను తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి

- బీఆర్ఎస్ నాయకులు

**బాల్కొండ, విశాలభారతి** రైతులతో పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు. శనివారం రైతులకు ఈ సీజన్ రైతు భరోసా ఇవ్వలేము అని చెప్పిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వ్యాఖ్యలకు నిరసనగా బాల్కొండ నియోజకవర్గం అన్ని మండల కేంద్రాలలో రైతులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత సీజన్ రైతుభరోసా కూడా రేపు మాపు అంటూ ఇవ్వలేదని,ఇప్పుడు ఈ సీజన్ రైతు భరోసా కూడా ఇవ్వలేమని వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడటం రైతులను నమ్మించి మోసం చేసినట్టే అని అన్నారు. పంట పెట్టుబడి కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారని కానీ ప్రభుత్వం మళ్ళీ మోసం చేసిందన్నారు. రైతులు ఇప్పుడు పంట వేయడానికి పెట్టుబడి పెట్టాలంటే మళ్ళీ వ్యాపారస్థుల దగ్గర వడ్డికి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గత ప్రభుత్వంలో పండగ అన్న వ్యవసాయం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో దండగ అనేలా ఉంది అన్నారు. రుణమాఫీ లేదు, కరెంట్ సక్రమంగా ఇవ్వటం లేదు,ఇప్పుడు పంట పెట్టుబడి ఎగ్గొట్టారు రైతులన్ని గమనిస్తున్నారు.రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వానికి సిఎం రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.




మూసీ పునరుజ్జీవ ప్రక్రియలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన నాగోల్ మురుగు నీటి శుద్ధీకరణ ప్లాంట్ (ఎస్టీపి) ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ మంత్రులు మహమూద్ ఆలీ, సబితా ఇంద్రా రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మా రెడ్డి, వివేకానంద్ గౌడ్, మాధవరం కృష్ణా రావు, ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ సురభి వాణి, బీఆర్ఎస్ బృందం పరిశీలించింది.



# 'మాలల ఆత్మగౌరవం కోసం పోరాటం'

**తుర్కయంజాల్, విశాలభారతి:** ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా, మాలల హక్కుల సాధనే ధ్యేయంగా ఐక్య వేదిక పోరాడుతుందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక రాష్ట్ర కో చైర్మన్ గద్ద శ్రీనివాస్ అన్నారు. మాల మహానాడు ఆధ్వర్యంలో తుర్కయంజాల్అంబేద్కర్ చౌరస్తాలో మాలల ఆత్మగౌరవ సభ వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గద్ద శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 27న నాగర్ కర్నూల్ లో జరిగే మాలల ఆత్మగౌరవ సభకు మాల కులస్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మాజీ సర్పంచ్ చెవుల దశరథ, జై భీమ్ యువజన సంఘం మాజీ అధ్యక్షులు నల్లవెల్లి వెంకటేష్, చక్రపాణి, తావుల శ్రీనాథ్, చెవుల నరేందర్, సల్వాది యాదగిరి, సల్వాది రమేష్, మద్దెల కృష్ణ, కామల రామస్వామి, నీరెడ్డి రాజు, సుందరయ్య టీచర్, రాము, రేనాన్ సామ్రాట్, సాయి గౌరవ్, బలరామ్, వినోద్, భాను ప్రసాద్, లక్ష్మయ్య, కృష్ణయ్య, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.



# వెస్లీ విద్యా సంస్థలు ఉపాధికి పెట్టింది పేరు

- ఘనంగా మెరిట్ సర్టిఫికేట్స్ పంపిణీ
- డైరెక్టర్ డా.బి.విమల్స్ కుమార్

**సికింద్రాబాద్, విశాలభారతి:** వెస్లీ విద్యా సంస్థలు ఉపాధికి క్రమశిక్షణ కు పెట్టింది పేరు అని వెస్లీ ఫిజి కళశాల డైరెక్టర్ డా.బి.విమల్స్ కుమార్ అన్నారు. శనివారం వెస్లీ పీజీ కళాశాలాలో ఎంబీఏ ( 2022 2024 ), విద్యార్థులకు జరిగిన మెరిట్ సర్టిఫికేట్స్ ప్రధానం కార్యక్రమంలో అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ ఉపాది అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి అన్నారు. ఇక్కడ సువిశాల వాతావరణంలో విద్యార్థులకు నిష్ణాతులైన అధ్యాపకులు భోదిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మెరిట్ లో నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికేట్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.పి. యం.యోహాన్ విభాగం అధ్యాపకులు, పేరెంట్స్ ,ఉద్యోగులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వీసీల నియామకాల్లో గిరిజన ప్రొఫెసర్లకు తీవ్ర అన్యాయం

- గిరిజన చైతన్య వేదిక అధ్యక్షుడు డా.కరాటే.రాజు

**సికింద్రాబాద్ విశాలభారతి:** వీసీ ల నియామకాల్లో గిరిజన ప్రొపెసర్స్ కు తీవ్రమైన అన్యాయం జరిగిందని గిరిజన చైతన్య వేదిక అధ్యక్షుడు డా.కరాటే.రాజు నాయక్ అన్నారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుబంధ కళాశాలలు లేని ప్రభుత్వ గుర్తింపు కూడా సరిగా లేని మహిళ యూనివర్సిటీ కి గొప్ప ప్రతిభ ఉన్న గిరిజన మహిళ ప్రొఫెసర్ అయిన ప్రొఫెసర్ సూర్యదనుజయ్ కి ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ ఇవ్వడమంటే గిరిజన మహిళ ప్రొఫెసర్ ని అవమానించడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 9 యూనివర్సిటీలకు వీసీ లకు గాను ఒక్క గిరిజన ప్రొఫెసర్ ని కూడా వీసీ గా నియమించకపోవడం సిగ్గు చేటు



అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గిరిజనులకు ముఖ్యంగా బంజారా ప్రజలకు వ్యతిరేకంగా ఉన్నాడని అందుకు ఉదాహరణలు విద్య కమిషన్ లో ఒక్క బంజారా ప్రొఫెసర్ కి కానీ విద్యావంతులకు ఇవ్వకపోవడం అలాగే ఎడ్యుకేషన్ అడ్వైసరి కమీటీలో మరియు హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ లో కూడా ఒక్క గిరిజన మేధావులకు ఇవ్వకపోవడం గిరిజనులకు అవమానించడమే తెలిపారు.



# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం

**వేల్పూర్ విశాల భారతి** వేల్పూర్ మండల కేంద్రంలోని రైతుల పక్షాన బిఆర్ఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు దగా కోరు మాటలు చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశాడని అన్నారు. రైతు రుణమాఫీ 25 శాతం పూర్తిచేసి 75 శాతం మంది రైతులకు రుణమాఫీ చేయకుండానే చేతులు దులుపుకున్నాడని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాటలు నీటి మూటల్ల ఉన్నాయని ఖరీఫ్ సీజన్లో రైతుబంధు ఇవ్వకుండానే రబీ సీజన్లో రైతుబంధు ఇస్తామని తెలపడం హాస్యాస్పదం గా ఉందని వారన్నారు. ఖరీఫ్ సీజన్లో రైతు బంధు ఇవ్వకుండానే రైతులను మరిపించారని వారు ఎద్దేవా చేశారు. కాలయాపనే తప్ప ఇచ్చిన మాట నిలబెట్టుకున్న దాఖలాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి లేవని దుయ్యబట్టారు. అలాగే రైతులు పండించిన పంటలను కూడా గిట్టుబాటు ధరకే కొనుగోలు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికిని కొనుగోలు చేసిన పంటను తిరిగి వాపస్ చేయడమనేది సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని రైతుబంధు రైతు రుణమాఫీని పూర్తి చేసి రేవంత్ రెడ్డి తన మాట నిలుపుకోవాలని సూచించారు. ఒకవేళ ఇచ్చిన వాగ్దానాలను పూర్తి చేయనట్లయితే రాష్ట్రస్థాయిలో ధర్నా కార్యక్రమాలు నిర్వహించి వంటావార్పు కార్యక్రమాలను చేపడతామన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం రైతు పక్షాన ఎప్పుడూ ఉంటుందని ఇప్పుడున్న రైతాంగము అందరు కలిసికట్టుగా పోరాటం చేయవలసిన అవసరం ఏర్పడిందని మనమంతా ఏకధాటికి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. రేవంత్ రెడ్డికి పాలన చేత కాదని పాలన చేతకాకపోతే రాజీనామాలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు రేగుల్ల రాములు, డొల్ల రమేష్, మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నాగాధర్, మాజీ ఎంపీటీసీలు శ్యామ్ రావు, సొసైటీ చైర్మన్ హనుమంతు రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ యల్ల శ్రీనివాసరెడ్డి, పిట్ల సత్యం, మాజీ సర్పంచులు సౌద రమేష్, టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పిడిఎస్యూ సభను విజయవంతం చేయండి

- పిడిఎస్యూ రాష్ట్ర నాయకుడు సంతోష్

**కల్వకుర్తి, విశాల భారతి** హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో పి డి ఎస్ యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబోయే పి డి ఎస్ యు అర్థ శతాబ్దోత్సవ మహాసభను విజయవంతం చేయాలని పి డి ఎస్ యు రాష్ట్ర నాయకుడు సంతోష్ కోరారు. ఈ మేరకు శనివారం కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సభకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఉస్మానియా యూనివర్సిటీలో జార్జిరెడ్డి అమరత్వాన ఏర్పడిన పి డి ఎస్ యు ఈ అక్టోబర్ నాటికి 50 సంవత్సరాలు పూర్తవుతుందని, ఆ సంఘం సంక్షేమ హాస్టల్ కోసం, శాస్త్రీయ విద్యా విధానం కోసం, స్కాలర్షిప్ రియంబర్స్మెంట్, సమ సమాజ నిర్మాణం కోసం ఇంకా అనేక విద్యార్థి సమస్యల పైన నిరంతరం పోరాటాలు చేసి అనేక విజయాలను సాధించిందని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే విద్యార్థి ప్రదర్శన ర్యాలీ, ఠాగూర్ ఆడిటోరియం లో జరిగే అర్థ శతాబ్ద ఉత్సవాల బహిరంగ సభను విద్యార్థులు మేధావులు ప్రగతిశీల ప్రజాస్వామిక వాదులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల లెక్చరర్ సదానందం గౌడ్, విద్యార్థులు రామ్, సాయి, కార్తీక్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


- మారం జగదీశ్వర్, ఎస్ఎం హుస్సేని

**హైదరాబాద్, విశాలభారతి:** టిఎన్జీఎస్ కేంద్ర సంఘ అధ్యక్షులు మారం జగదీశ్వర్ , ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం హుస్సేని మర్యాదపూర్వకంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ ని కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల దీర్ఘకాలపు సమస్యల పరిష్కరించాలి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పీకర్ సానుకూలంగా స్పందించి అన్ని సమస్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర సంఘ ఉపాధ్యక్షులు కస్తూరి వెంకట్, ముత్యాల సత్యనారాయణ గౌడ్, నాలుగో తరగతి రాష్ట్ర అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు



# ప్రజలను దోచుకోవడం కాంగ్రెస్ నైజాం

- బిఆర్ఎస్ ను విమర్శించే అర్హత ఎమ్మెల్యేకు లేదు
- నిస్వార్థంగా ప్రజలకు సేవ చేశా
- తప్పు చేసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుండి తప్పుకుంటా
- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**ఆమనగల్లు, విశాలభారతి ::** తనకు రాజకీయ జన్మనిచ్చి బిక్ష పెట్టిన బి ఆర్ ఎస్ ను, ఆ పార్టీ అధినేత కేసీఆర్ ను విమర్శించే అర్హత కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి లేదని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆరోపించారు. శనివారం ఆమనగల్లు లో మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీని విమర్శించే స్థాయి నిది కాదని స్వలాభం కోసం పార్టీ మారిన నువ్వు పార్టీ గురించి మాట్లాడడం ఏమిటన్నారు. బిఆర్ఎస్ పార్టీలో ఉండి పదవులను అనుభవించి పార్టీ మారగానే కన్నతల్లి ఇలాంటి బిఆర్ఎస్ పార్టీని తిడుతుంటే ప్రజలు నమ్మి పరిస్థితిలో లేరన్నారు. తాను నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తూ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశానని ఎక్కడ తప్పు చేయలేదని తప్పు చేసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుండి తప్పుకుంటానని ఆయన సవాల్ చేశారు. తనకు వ్యాపార సంస్థలు లేవని డబ్బు సంపాదించాలని రాజకీయాల్లోకి రాలేదని, ప్రజలను దోచుకోవడం దాచుకోవడం కాంగ్రెస్ నైజమని ఎమ్మెల్యే గుర్తించాలని హితవు పలికారు. బిఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి జరిగినా జరుగలేదు అనడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. అదే పార్టీలో ఉండి చేసిన అభివృద్ధిని చూసిన ఆయన అప్పుడు అభివృద్ధి విషయంపై ఎందుకు ప్రశ్నించ లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు లోని ఆయన భూమి ఎఫ్టిఎల్, బఫర్ జోన్ లో ఉందని బిజెపి నేత ఆచారి ఆరోపిస్తే ఆయనను ప్రశ్నించకుండా బిఆర్ఎస్ పై బురద చల్లడం ఎంత వరకు సమంజసం మన్నారు. అభివృద్ధి ప్రభుత్వాల నిరంతర ప్రక్రియ అని, ఏ ప్రభుత్వంలో అన్ని సాధ్యం కావని నియోజకవర్గం పై ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ చేశారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణ చేయడం మానుకోవాలని జైపాల్ యాదవ్ ఎమ్మెల్యేకు హితవు పలికారు. సమావేశంలో మాజీ జెడ్పిటిసి అనురాధ,బిఆర్ఎస్ మండల అధ్యక్షులు అర్జున్ రావు,మున్సిపాలిటీ అధ్యక్షులు పత్య నాయక్, నాయకులు శ్రీను నాయక్, బాలస్వామి, వస్పుల సాయిలు,కోట శ్రీను, చుక్క నిరంజన్ గౌడ్, ఎంగలి రఘు, పంతు,గండికోట శంకర్, సుభాష్,సైదులు,శివ, రమేష్,వెంకటేష్, రమేష్ నాయక్, , గణేష్ తదితరులు పాల్గొన్నారు.




# చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియాతో ముందుకెళ్తాం

- రూరల్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ చిన్నమ్మ థామస్

**వనపర్తి, విశాల భారతి::** బాల్య వివాహ నిరోధక చట్టాన్ని విఘాంతం తలపెట్టే వ్యక్తులు గాని కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు దర్యాప్తు సంస్థలకు ఆదేశాలు జారీ చేసిందని రూరల్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ చిన్నమ్మ థామస్ అన్నారు. చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా కోసం ముందుకు వెళ్తామని ఆమె అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఉన్న రూరల్ డెవలప్మెంట్ సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సుప్రీంకోర్టు తీరుపై సేవలతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు హర్షం వ్యక్తం చేసినట్లు ఆమె తెలిపారు. బాల్య వివాహం అనే సామాజిక దురాచారంపై జరుగుతున్న యుద్ధంలో ఇది ఒక కీలక విజయమని ఆమె పేర్కొన్నారు. 2030 నాటికి దేశంలో బాల్యవివాహాలు పూర్తిగా అడ్డుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయని అన్నారు. చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా అనే నినాదంతో ముందుకు వెళ్తామని ఆమె తెలిపారు. బాల్యవివాహాలను అరికట్టడం కోసం పర్సనల్ చట్టాల కన్నా బాల్య వివాహాల నిరోధక చట్టంమే పై చేయి గా ఉండాలని చూపించిన ధర్మాసనం తీర్పుపై ఆమె హర్షం వ్యక్తం చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న బాల్య వివాహాలపై ప్రత్యేక అధికారిని నియమించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కన్నన్ కుమార్, రాజశేఖర్, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భీమ పథకాల సద్వినియోగం కోసం బ్యాంకర్లు సహకరించాలి

**వనపర్తి, విశాల భారతి:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలైన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో శనివారం బ్యాంకర్లతో కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల నమోదు, ఎస్టీ, ఎస్సి కార్పొరేషన్ రుణాల పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదర్శ సురభి మాట్లాడుతూ.. కేంద్ర బీమా పథకాలైన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. ఇవి చాలా ముఖ్యమైన పథకాలని, బ్యాంకర్లు అందరూ సీరియస్ గా దృష్టి సారించాలని సూచించారు. బ్యాంకు ఖాతాలు ఉన్న వారంతా ఈ బీమా పథకాలకు అర్హులేనని, వారందరికీ ఈ బీమా పథకాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఖాతాదారు ఇంటికి వెళ్లి వారికి ఈ బీమా పథకాలను వివరించి, నమోదు చేసుకునేలా చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతిలో పంచాయతి కార్యదర్శితో సమన్వయం చేసుకుని ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పథకానికి కేవలం సంవత్సరానికి రూ.430 కడితే రూ.2 లక్షల జీవిత భీమా వస్తుందని, అదే ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన పథకంలో సంవత్సరానికి కేవలం రూ.20 చెల్లిస్తే ప్రమాదం జరిగినప్పుడు పాక్షిక అంగవైకల్యం ఏర్పడితే రూ.లక్ష, శాశ్వత అంగ వైకల్యం ఏర్పడితే రూ.2 లక్షల భీమా వస్తుందని అవగాహన కల్పించాలన్నారు. అయితే, బ్యాంకర్లు స్పందిస్తూ ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభించామని బదులిచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాల గురించి మాట్లాడుతూ 201819 లో స్వయం ఉపాధి కొరకు ఎస్సీ శాఖ ద్వారా మంజూరు అయిన 58 సబ్సిడీ రుణాలు గ్రౌండింగ్ కాకపోవడానికి గల కారణాలు ఏంటని బ్యాంకర్లను, ఎస్సీ కార్పొరేషన్ ఈడీని ప్రశ్నించారు. ఆయా రుణాలు వేగంగా గ్రౌండింగ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్దిదారుని వారీగా రుణం గ్రౌండింగ్ కాకపోవడానికి గల కారణాలు తెలుసుకుని బ్యాంకర్లతో కలిసి పరిష్కారం దిశగా పని చేయాలన్నారు. డ్యూయల్ అకౌంట్ తెరవని లబ్దిదారునికి వెంట ఉండి అకౌంట్ ఓపెన్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనుల ఆర్థికాభ్యున్నతికి 80 శాతం రాయితీపై ప్రభుత్వం ఏటా ట్రైకార్ (ట్రైబల్ కార్పొరేషన్) రుణాలు కేటాయిస్తుందని, అందులోభాగంగా జిల్లాలో ఇంకా పెండింగ్ లో ఉన్న రుణాలను గ్రౌండింగ్ చేయించే విధంగా దగ్గరుండి చర్యలు తీసుకోవాలని గిరిజన శాఖ అధికారిని ఆదేశించారు.



**పీఎంఈజీపీ రుణాలను యువత వినియోగించుకోవాలి:**

ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ) కింద నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి, స్థిర ఆదాయం వచ్చే నూతన యూనిట్లను స్థాపించి ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా చూడాలని అన్నారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు ప్రాధాన్య రంగాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. యువత ఎవరైనా సేవా, పారిశ్రామిక రంగంలో రాణించేందుకు ఆసక్తి ఉంటే పీఎంఈజీపీ పథకాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పీఎంఈజీపీ కార్యక్రమం కింద అర్హులైన వారు వివిధ రకాల వ్యాపార యూనిట్లు పెట్టేవారికి గ్రామీణ 35శాతం వరకు సబ్సిడీ అందుతుందని చెప్పారు. ఎవరైనా యూనిట్లు పెట్టడానికి సిద్ధంగా ఉంటే జిల్లా కలెక్టరేట్ లోని ఇండస్ట్రీస్ శాఖ అధికారి నగేష్ (8332904444) ను లేదా లీడ్ బ్యాంకు మేనేజర్ సంప్రదించాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీవో పీడీ ఉమాదేవి, గిరిజన శాఖ అధికారి నుషిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లిఖార్జున్, లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే, ఇండస్ట్రీస్ ప్రమోషన్ ఆఫీసర్ నగేష్, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.



# బాల్యవివాహాలను అరికట్టడంలో బాలల సంరక్షణ కమిటీల పాత్ర కీలకం

**వనపర్తి, విశాల భారతి:** బాల్యవివాహాలను అరికట్టడంలో గ్రామ స్థాయి బాలల సంరక్షణ కమిటీల (వీసీపీసీ), మండల స్థాయి బాలల సంరక్షణ కమిటీల (ఎంసీపీసీ) పాత్ర కీలకమని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో బాల్యవివాహాలను అరికట్టే అంశంపై జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలను అరికట్టడం ఎంతో ముఖ్యమని చెప్పారు. జిల్లాలో ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా గ్రామ స్థాయి నుంచి అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందులో భాగంగా ప్రతి గ్రామంలో గ్రామస్థాయి చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను, మండల స్థాయిలో మండల చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను యాక్టివేట్ చేయాలని సూచించారు. బాల్యవివాహాలను కట్టడి చేయడంలో ఆయా కమిటీలది కీలక పాత్ర అని చెప్పారు. వీసీపీసీ లలో పంచాయతీ కార్యదర్శి , ఎంసీపీసీలలో తహసీల్దార్ బాల్య వివాహాల ప్రొవేషన్ అధికారులుగా (సీఎంపీఓ), క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. వీరికి బాల్య వివాహాలను కట్టడి చేయడంలో కేసులు నమోదు చేయడానికి అధికారం ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో బాల్య వివాహాల సమాచారం ముందుగా తెలుసుకుని, లేదా ఏవైనా బాల్యవివాహాలు దృష్టికి వచ్చిన వెంటనే బాధితులను రక్షించి బాధ్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతినెల ఈ కమిటీల సమావేశాలను నిర్వహించి, అన్ని మతాలకు సంబంధించిన పెళ్లిళ్లు జరిపే పెద్దలకు కూడా బాల్య వివాహాలను అరికట్టే అంశంపై సూచనలు చేయాలన్నారు. అక్టోబర్ చివరి వారంను "చైల్డ్ మ్యారేజ్ ప్రివెన్షన్ వీక్" గా గుర్తించి కమిటీల ఆధ్వర్యంలో బాలల సంరక్షణకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బాలల సంరక్షణకు సంబంధించిన హెల్ప్ లైన్ నెంబర్ 1098 పైన అవగాహన కల్పించాలన్నారు. ఇంకా ఎల్ ఆర్ ఎస్ పెండింగ్ దరఖాస్తుల విషయానికి సంబంధించి ఆర్ఐ స్థాయిలో పెండింగ్లో ఉన్న వాటిని వేగంగా పరిష్కారం చేయాలని తహసిల్దార్లకు అదనపు కలెక్టర్ సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ, డిప్యూటీ సీఈఓ రామమహేశ్వర్, డివైస్ఓ సుధీర్ రెడ్డి, బీసీ శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, డిపిఓ సురేష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున, డిసిపిఓ రాంబాబు, ఫిషరీస్ అధికారి లక్ష్మప్ప, తహసీల్దార్లు మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లైన్ల రోడ్ల విస్తరణకు రూ.77కోట్లు మంజూరు

- మంత్రి పొన్నం ప్రభాకర్ కు ధన్యవాదాలు
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతి రెడ్డి..



**చిగురుమామిడి, విశాల భారతి** కొత్తపల్లి నుండి హుస్నాబాద్ వరకు 4లైన్ల రోడ్ల విస్తరణకు రూ.77.20కోట్లు మంజూరు చేయించిన రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కంది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కొత్తపల్లి నుండి హుస్నాబాద్ వరకు రాజీవ్ రహదారి 4లైన్ల విస్తరణ కోసం రూ. 77.20 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయటం సంతోషంగా ఉందన్నారు. దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్న కొత్తపల్లి నుండి హుస్నాబాద్ వెళ్ళే ప్రయాణికుల సమస్యలు తీర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, రోడ్లు, భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ కు తిరుపతి రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. కరీంనగర్ నుండి హుస్నాబాద్ వైపు 4లైన్ల రోడ్డుకు నిధులు మంజూరు కావటంతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని కంది తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తక్కువ సమయంలోనే హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని తిరుపతిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతారని తిరుపతిరెడ్డి తెలిపారు.

# సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలం కేటాయించండి

- రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్
- జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డికు వినతి



**పటాన్ చెరు,విశాలభారతి** సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నాగేష్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శనివారం కమిషనర్ కార్యాలయంలో ఎలక్ట్రిసిటీ ఏడి నాగరాజు, ఏఈ సంజీవ రావుతో కలసి జడ్సీ ఉపేందర్ రెడ్డితో సమావేశమయ్యారు. సబ్ స్టేషన్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. డివిజన్ పరిధిలో కరెంటు సమస్య తీవ్రంగా ఉందని, ప్రభుత్వం ద్వారా సబ్ స్టేషన్ కొసం నిధులు మంజూరు అయి ఉన్నాయని, సబ్ స్టేషన్ నిర్మించడానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరారు. ఉన్నత అధికారులతో మాట్లాడి ప్రభుత్వ స్థలం చూసి కేటాయిస్తామని హామీ ఇచ్చినట్టు కార్పొరేటర్ తెలిపారు. స్ట్రీట్ లైట్స్ కొరత తీవ్రంగా ఉందని, చీకటిలో చాల అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయ అని చెప్పారు. స్ట్రీట్ లైట్స్ మంజూరు చేయాలని, పలు సీసీ రోడ్ల కోసం నిధులు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి కార్పొరేటర్ పుష్ప కోరారు.



# వడ్లు కొనుగోలు కేంద్రం పరిశీలన

- అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్మయి

**సైదాపూర్ విశాల భారతి** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్మయి నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని దుద్దెనపల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఐకేపీ మహిళలతో ఆమె మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణను పూర్తి చేయాలన్నారు. హమాలీల కొరతను తీర్చేందుకు అవసరమైన లేబర్‌లను సమకూర్చుకోవాలన్నారు. ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు ఇవ్వాలన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులను సంప్రదించి గన్నీబ్యాగులను సమకూర్చుకోవాలన్నారు. రైతులు వాతావరణ పరిస్థితులను అంచనావేస్తూ ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. రైతులు వడ్లను తూర్పరా వట్టి వ్యవసాయ విస్తరణ అధికారి చే ఎఫ్ ఏ క్యూ సర్టిఫికెట్ తేమ శాతం 17 ఉన్న వరిధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి లారీల ద్వారా మిల్లులకు తరలించాలని సూచించారు. ఉన్నతాధికారుల సాయం కోసం సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దూలం మంజుల చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి సీఈఓ శ్రీధర్ గుండారపు శ్రీనివాస్ తాళ్లపల్లి వెంకటేశం సమ్మయ్య నిర్వాహకులు పాల్గొన్నారు.



# ఆదర్శ పాఠశాల విద్యార్థులకు అభినందనలు

- మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి

**సైదాపూర్, విశాల భారతి** సైదాపూర్ మండలంలోని సోమవారం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఈనెల 18న కరీంనగర్ టౌన్ లో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలో ప్రతిభ కనిపించిన సర్వేందర్, లౌకిక ,కుష్మాంజల్, సరూప్ రావు ,సుశాంత్ ,సాయి వర్ధన్ విద్యార్థులను మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్ కుమార్ ,వైస్ ప్రిన్సిపాల్ కుమార్ ,జిల్లా ఎస్ జి ఎఫ్ సెక్రటరీ వేణుగోపాలు , మాజీ ఎస్.జి.ఎఫ్ సెక్రటరీలు కనకం సమ్మన్న, పోతన శ్రీనివాస్ సార్లు, ఉపాధ్యాయులు ఆదర్శ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఉయ్యాల విష్ణువర్ధన్గౌడ్ లు అభినందించారు.




# వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర మరువలేనిది

- మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలి
- బొప్పని పద్మ

**సూర్యాపేట, విశాల భారతి** భారత వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర గణనీయంగా ఉందని మహిళ కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పాని పద్మ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లి వెంకట నరసింహారెడ్డి భవన్లో జరిగిన సూర్యాపేట జిల్లా మహిళా కూలీల జిల్లా సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని అన్నారు. వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న మహిళలకు కనీస వేతనం చట్టం ప్రకారం అమలు చేయాలని కోరారు. వ్యవసాయ కూలీల మహిళల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వివరిస్తున్నాయని ఆరోపించారు. సమాధానం ద్వారా చనిపోయిన మహిళ వ్యవసాయ కార్మికులకు 10 లక్షల రూపాయలు ఎక్సైజ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహిళ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ గా జంపాల స్వరాజ్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, జిల్లా ఉపాధ్యక్షులు పులుసు సత్యం, సోమపంగా జానయ్య, ఆరేరామకృష్ణా రెడ్డి, ఉప్పలయ్య, వనం సోమయ్య, ఉయ్యాల పారిజాత, అండం వెంకటమ్మ, తురక నాగమ్మ, కొండ భవాని, దారా ధనలక్ష్మి, అంజపల్లి పద్మ, నందిపల్లి పూలమ్మ రెడ్డి మల్ల ఇందిర తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం

**సూర్యాపేట, విశాల భారతి** బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల బాలెంల నందు మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయిలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం2024 వ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం మిషన్ శక్తి కోఆర్డినేటర్ చైతన్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారి నరసింహా రావు పాల్గొని మాట్లాడుతూ బాలికల సాధికారికత గురించి ప్రతి ఒక్కరు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండే విధంగా భవిష్యత్తు ఆలోచనలు ఉండాలని, ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్న ఐఏఎస్ , ఐపీఎస్ , జడ్జిలు, డాక్టర్స్ అందరూ కూడా గ్రామస్థాయి నుండి నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన వారిని తెలిపినారు. జిల్లా బాలల సంక్షేమ సమితి రమణారావు మాట్లాడుతూ పిల్లల సంరక్షణకు అవసరమైన చట్టాల గురించి, ఆడపిల్ల పుట్టుతుందని భయం, గర్భస్థ నిర్ధారణ పరీక్షలు చేసిన వారిపై చట్టపైన చర్యలు, ఆడపిల్లలు ఆరోగ్యంగా ఉండటానికి కావలసిన జాగ్రత్తలు గురించి చెప్పడం జరిగింది. రామ్ రెడ్డి, బిక్షం సార్ మెంబెర్స్ సి.డబ్ల్యూ.సి వారు మాట్లాడుతూ పిల్లలకు అన్ని విధాల ఆదుకోవటానికి పిల్లల చట్టాలు బలంగా ఉన్నాయని అన్నారు. సఖి సెంటర్ అడ్మిన్ హేమలత మాట్లాడుతూ ఆడపిల్లల సంరక్షణ, చదువు ప్రాముఖ్యత, ఆడపిల్ల భవిష్యత్తులో, ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారాల గురించి చెప్పినారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి రవికుమార్ మాట్లాడుతూ బాల్య వివాహం వాళ్ళ జరిగే అనర్థాలు వాటి వల్ల నష్టాల గురించి చెప్పటం జరిగింది. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడలలో పాల్గొన్న ఆడపిల్లలకు బహుమతులు జిల్లా సంక్షేమ అధికారి, చైల్డ్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ మెంబర్స్,జిల్లా బాలల పరిరక్షణ అధికారి, సెంటర్ అడ్మిన్, మిషన్ శక్తి కోఆర్డినేటర్ చేతుల మీదగా అందచేయడం జరిగింది.ఈ కార్యక్రమం నందు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ , డీసీడీఓ పూలన్, సిడబ్ల్యూసి చైర్మన్ రమణ రావు, మెంబెర్స్ బిక్షం, రామిరెడ్డి, డీసీపీఓ రవి, మహిళ సాధికారిత కేంద్రం డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ చైతన్య, సఖి సెంటర్ అడ్మిన్ హేమలత, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మీరా, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ లింగయ్య, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బొల్లెద్దు వెంకటరత్నం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వాణి, బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, సుధాకర్, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ స్కూల్ టీచర్స్ విద్యార్థినిలు పాల్గొన్నారు.



# ఆరబెట్టిన ధాన్యం మాత్రమే ఐకెపి కేంద్రాలకు తీసుకుని రావాలి

- తేమ 17శాతం వుండాలి
- తాలు లేకుండా ధాన్యం తీసుకుని రావాలి
- జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత

**సూర్యాపేట, విశాల భారతి** రైతులు తమ ధాన్యం పొలం వద్ద గాని, ఇంటి వద్ద గాని ఆరబెట్టిన తరువాత మాత్రమే ఐకెపి కేంద్రాలకు తీసుకుని రావాలని జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని కుసుమవారి గూడెం నందు మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17శాతం తేమ శాతం వుండాలని, తాలు లేకుండా నాణ్యత కలిగిన ధాన్యం తీసుకుని వచ్చి మద్దతు ధర పొందాలని అన్నారు. సన్న ధాన్యంకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ ను వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో చెల్లిస్తారని చెప్పారు. ధాన్యం తడవకుండా ఐకెపి కేంద్రాలలో టార్పాలిన్ పట్టాలు అందుబాటులో వుంచాలని, అలాగే ధాన్యం రవాణా జరిగే లారీల పైన కూడ టార్పాలిన్ పట్టాలు కప్పాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించి ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్,మెప్మా అధికారి రేణుక, మెప్మా ఇంఛార్జ్ స్వేత, వార్డు కౌన్సిలర్ నెల్లుట్ల సోమలక్ష్మి, స్థానిక నాయకులు గంగా లింగా రెడ్డి,జూలకంటి నాగేందర్ రెడ్డి, గోగుల రామకృష్ణ, జిన్న ప్రభాకర్, ఇరగదిండ్ల సైదులు, కుర్రి నాగయ్య, జిన్న కల్పన, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# పౌర్ణమి రోజున నరబలి

**విశాలభారతి, నేషనల్ న్యూస్:** ఒడిశా బలంగీర్ జిల్లాలో 13 ఏళ్ల బాలుడు దారుణ హత్యకు గురయ్యాడు. బాలుడిని అడవిలోకి తీసుకెళ్లి హత్యచేసి వదిలేశారు గుర్తుతెలియని దుండగులు. ఈ హత్య కేసులో పోలీసులు ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ హత్యను నరబలిగా పోలీసులు అనుమానిస్తున్నారు. లాథోర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జలియాలిటి గ్రామ సమీపంలో ఉన్న అడవిలో 13 ఏళ్ల బాలుడి మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. మృతుడిని సోమనాథ్ బివార్‌గా గుర్తించారు. గురువారం నుంచి సోమనాథ్ కనిపించకపోవడం వల్ల, అతడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ముమ్మరంగా గాలించి బాలుడి మృతదేహాన్ని కనిపెట్టారు. పౌర్ణమి రోజున తన కుమారుడిని ఎవరో నరబలి ఇచ్చారని సోమనాథ్ తండ్రి తపన్ బివార్ వాపోయారు. నరబలిని కొందరు పౌర్ణమి రోజు చేస్తారని తెలిపాడు. మృతదేహాన్ని పాతిపెట్టేందుకు ప్రయత్నించారని, కానీ ఎందుకో బయటే వదిలేశారని చెప్పుకొచ్చారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com
vishalabharathi Telugu Daily
ఆదివారం,
20.10.2024
హైదరాబాద్




# సన్నీ డియోల్ జాత్ ఫస్ట్ లుక్

బాలీవుడ్ స్టార్ సన్నీ డియోల్ యాక్షన్ హీరోగా నాలుగు దశాబ్దాల తన సక్సెస్ ఫుల్ కెరీర్‌లో100 మైల్ స్టోన్ మూవీకి చేరువయ్యారు. రీసెంట్ బ్లాక్ బస్టర్ గద్దర్ 2 తో అలరించిన సన్నీ డియోల్, ఇంటెన్స్ యాక్షన్ ఎంటర్ టైనర్స్ తో అలరించే మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేనితో చేతులు కలిపారు. ఈ కొలాబరేషన్ దేశవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించే గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది. మైత్రీ మూవీ మేకర్స్‌పై నిర్మాతలు నవీన్ యెర్నేని, వై రవిశంకర్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాత టిజి విశ్వప్రసాద్‌తో కలిసి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌కి "జాత్" అనే పవర్‌ఫుల్ టైటిల్ ఖరారు చేశారు. సన్నీ డియోల్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ సన్నీ డియోల్‌ను పవర్ ఫుల్, ఇంటెన్స్ అవతార్‌లో ప్రజెంట్ చేసింది, ఈ యాక్షన్-ప్యాక్డ్ మూవీ నుండి ప్రేక్షకులు ఏమి ఆశించవచ్చో టోన్ ని సెట్ చేస్తుంది. సన్నీ డియోల్ తన శరీరమంతా బ్లడ్ మార్క్స్ తో మ్యాసివ్ ఫ్యాన్‌ని పట్టుకుని ఉన్న పోస్టర్ హై-ఆక్టేన్ డ్రామా, లార్జర్-దేన్-లైఫ్ యాక్షన్ సీక్వెన్స్ లని సూచిస్తుంది.



# కేసీఆర్' ట్రైలర్ చాలా బావుంది : డైరెక్టర్ సాయి రాజేష్


రాకింగ్ రాకేష్ లీడ్ రోల్ లో నటిస్తున్న మూవీ 'కేశవ చంద్ర రమావత్' (కెసిఆర్), గ్రీన్ ట్రీ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ మూవీకి గరుడవేగ అంజి దర్శకత్వం వహించారు. అన్నన్య కృష్ణన్ కథానాయికగా నటిస్తున్నారు. రాకింగ్ రాకేష్ స్వయంగా నిర్మించిన ఈ చిత్రం లంబాడీ వర్గానికి చెందిన యువకుడి రియల్ లైఫ్ నుంచి స్ఫూర్తి పొందింది. మేకర్స్ ఈరోజు సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. కేశవ చంద్ర రమావత్ (కెసిఆర్), అతని మరదలు మధ్య చిన్ననాటి స్నేహాన్ని ప్రజెంట్ ద్వారా ట్రైలర్ ప్రారంభమైయింది,అది క్రమంగా ప్రేమగా మారుతుంది. తన షార్ట్ నేమ్ కేసీఆర్ అని సగర్వంగా చెప్పకునే ఆ యువకుడు కేసీఆర్‌తో ఎంతో స్ఫూర్తి పొందాడు. అయితే అతను తన చిన్ననాటి మరదలుతో మ్యారేజ్ ప్రపోజల్ ని రిజెక్ట్ చేస్తాడు. కథ ఇలా సాగుతుండగా, కేసీఆర్ ఒక లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌కు బయలుదేరుతాడు. రాకింగ్ రాకేష్ మనసుని హత్తుకునే కథను రాసారు. గరుడ వేగ అంజి దర్శకుడిగా, సినిమాటోగ్రాఫర్‌గా కట్టిపడేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సాయి రాజేష్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. హృదయ కాలేయం ఆడియో ఫంక్షన్ కి రాకేష్ ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా స్కిట్ చేసి వెళ్ళాడు. ఆ కృతజ్ఞత నాకు అలా ఉండిపోయింది. కొన్ని రోజులుగా ముంబైలో ఉన్నప్పటికీ రాకేష్ కోసం ఈ ఈవెంట్ కి వచ్చాను. ఆ రోజు మాకు సపోర్ట్ చేసిన రాకేష్ కి ఈ వేదిక పైన థాంక్స్ చెప్తున్నాను. తనకి కెరీర్ లో బెస్ట్ క్యారెక్టర్ రాస్తానని మాట ఇచ్చాను. తొందరలోనే ఆ క్యారెక్టర్ రాసి రుణం తీర్చుకుంటాను. సినిమా తీసి చూస్తే జీవితం అంటే ఏంటో తెలుస్తుంది. ఈ సినిమా ట్రైలర్ చాలా బావుంది. ఈ సినిమాతో రాకేష్ మంచి స్థాయికి వెళ్ళాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ అంజి గారు మంచి దర్శకులు మంచి కెమెరామెన్. అర్జున్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చాలా బాగుంది. టీమ్ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్' చెప్పారు. టీజర్ లాంచ్ ఈవెంట్ లో హీరో రాకింగ్ రాకేష్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమాని మూడు ఫిలిం ఫెస్టివల్ లో ప్రదర్శించాలని నా కోరిక. దానికి మీరందరూ సపోర్ట్ కావాలి. సాయి రాజేష్ అన్న ఎంత థాంక్స్ చెప్పకున్న తక్కువే. సాయి నా సక్సెస్ కారణం నా భార్య సుజాత. ఈ జర్నీలో చాలా సపోర్ట్ చేశారు. మా సినిమాలో పని చేసిన ఆర్టిస్టులు, టెక్నీషియన్స్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు' తెలిపారు.



# 'మట్కా' నుంచి సాహు గా నవీన్ చంద్ర

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'మట్కా' రిలీజ్ కు రెడీగా వుంది. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, SRT ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలు కూడా జోరందుకున్నాయి. టీజర్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ లే లే రాజా చార్ట్ బస్టర్ రెస్పాన్స్ తో మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ అయ్యాయి. ఈ మూవీలో నవీన్ చంద్ర ఓ ఇంపార్టెంట్ క్యారెక్టర్ లో నటిస్తున్నారు. నవీన్ చంద్ర క్యారెక్టర్ ని సాహు గా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ ని రిలీజ్ చేశారు. నవీన్ చంద్ర స్కూటర్ పై కూర్చుని ఇంటెన్స్ గా చూస్తున్న పోస్టర్ క్యూరియాసిటీని క్రియేట్ చేసింది.

# పిజ్జా సినిమాకు పన్నెండేళ్ళు



విజయ్ సేతుపతి హీరోగా మారిన పిజ్జా తెలుగులో రిలీజ్ అయి పన్నెండేళ్ళు పూర్తయింది. "ప్రేమిస్తే","షాపింగ్ మాల్" మరియు "జర్నీ" వంటి పలు చిత్రాలను తెలుగు ప్రేక్షకులకు అందించిన సురేష్ కొండేటి పిజ్జా సినిమాను కూడా తెలుగులో రిలీజ్ చేశారు. తమ్మారెడ్డి భరద్వాజ చరిత చిత్ర బ్యానర్ మీద సమర్పిస్తూ ఈ సినిమాను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహించిన "పిజ్జా" చిత్రం తమిళంలో భారీ విజయం సాధించింది. విజయ్ సేతుపతి, రమ్య నంబీసన్ ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం కోసం అప్పట్లో దాదాపు 40 మంది నిర్మాతలు పోటీ పాడగా సురేష్ కొండేటి ఈ హక్కులను సొంతం చేసుకున్నారు. ఈ చిత్రం తమిళంలో లానే అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో కూడా భారీ విజయం సాధించింది. సురేష్ కొండేటి నిర్మాతగా సమన్య రెడ్డి కో ప్రొడ్యూసర్ గా ఈ సినిమాను అందించారు. అక్టోబర్ 19న పన్నెండేళ్ల క్రితం రిలీజ్ అయిన ఈ సినిమా సూపర్ హిట్ అయింది. ఈ సినిమా చేసిన తరువాత విజయ్ సేతుపతి పిజ్జా తరువాత ఒక వైపు హీరోగా సినిమాలు చేస్తూనే మరో వైపు నెగిటివ్ రోల్స్ లోనూ అదరగొడుతున్నాడు సేతుపతి. తెలుగు, తమిళ్ సినిమాలతో పాటు ఇప్పుడు హిందీ సినిమాల్లోనూ నటిస్తూ అలరిస్తున్నారు విజయ్ సేతుపతి. ఇక సేతుపతికి ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇక అప్పట్లో ఈ సినిమా ప్రమోషన్స్ లో విజయ్ సేతుపతి అందించిన సపోర్ట్ మర్చిపోలేనని, తన కారులోనే తిరుగుతూ ప్రమోషన్స్ చేశామని సురేష్ కొండేటి వెల్లడించారు. ఇక ఈ సినిమా డబ్బింగ్ కూడా సంతోషం స్టూడియోస్ లోనే జరిగిందని మెగా బ్రదర్ నాగబాబు, శివాజీ, ఉత్తేజ్ వంటివారు ఈ సినిమాకు తమ గాత్రదానం చేశారని ఆయన అన్నారు. 'పిజ్జా.' సినిమా వచ్చి నేటికి 12 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా, నటించిన నటీనటులకు, ఆదరించిన ప్రేక్షక దేవుళ్ళకు, మరియు పని చేసిన సాంకేతిక నిపుణులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

# కార్తిక్ ఆర్యన్ హైదరాబాద్ లో రాక్ చేశారు!



భూల్ భూలయ్యా 3 యొక్క ట్రైలర్ తుఫానులా వచ్చి అత్యధికంగా వీక్షించిన ట్రైలర్‌గా స్థిరపడగా, టైటిల్ ట్రాక్ విడుదలైనప్పటి నుండి మరో స్థాయిలో ముందుకు దూసుకెళ్తోంది. మిస్టర్ వరల్డ్‌వైడ్‌గా పిలువబడే పిట్ బుల్, గ్లోబల్ పంజాబీ సంచలనం దిల్జిత్ దోసాంజ్, భూల్ భులయ్యా సిరీస్ ప్రధానమైన నీరజ్ శ్రీధర్ మరియు కార్తిక్ ఆర్యన్ యొక్క కిల్లర్ హుక్ స్టెప్స్‌తో విభిన్న సంస్కృతులు మరియు బీట్ ల కలయికతో టైటిల్ ట్రాక్ ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరిగింది. టైటిల్ ట్రాక్ యొక్క ఫీవర్‌ను దేశంలోని వివిధ మూలలకు తీసుకెళ్లి, కార్తిక్ ఆర్యన్ నగర పర్యటనను ప్రారంభించాడు, అది ఇప్పుడు హైదరాబాద్‌కు చేరుకుంది. అతను ఢిల్లీలో భూల్ భూలయ్యా 3 టైటిల్ ట్రాక్‌ని ప్రారంభించాడు, అక్కడ అది సంచలనంగా మారింది. మూడు రోజుల నగర పర్యటన ఢిల్లీలో ప్రారంభమైంది, ఆ తర్వాత ఇండోర్, ఇప్పుడు హైదరాబాద్ చేరుకుంది. టీమ్ భూల్ భులయ్యా 3 మొదట DSR స్కూల్‌ని సందర్శించారు, ఆపై OG విద్యాబాలన్‌తో కలిసి కార్తిక్ ఆర్యన్ AKA 'రూహ్ బాబా' ప్రో కబడ్డీ లీగ్ ప్రారంభ వేడుకల దాకా పాటలని తీసుకెళ్లారు. టైటిల్ ట్రాక్ నిజంగా హైదరాబాదులో టోన్‌ను సెట్ చేసింది, ప్రతి ఒక్కరినీ ఆ ట్రాక్ మ్యాజిక్ లో ఉంచి, సినిమా విడుదల కోసం మాస్‌లో ఉత్సాహాన్ని నింపింది. బ్లాక్‌బస్టర్ భూల్ భూలయ్యా 2 నుండి రూహ్ బాబా పాత్రను కార్తిక్ ఆర్యన్ తిరిగి పోషించడంతో, అతను త్రిప్తి దిమ్రీ, OG మంజులిక, విద్యాబాలన్ మరియు మాధురీ దీక్షిత్‌లతో కలిసి కనిపిస్తాడు! అనీస్ బాజ్మీ దర్శకత్వం వహించారు మరియు భూషణ్ కుమార్ ప్రారంభించిన ఈ సినిమా విడుదల బాలీవుడ్ యొక్క ఇష్టమైన హారర్‌కామెడీ ఫ్రాంచైజీ యొక్క వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి సెట్ చేయబడింది. భయానక వినోదం మరియు నవ్వులతో నిండిన సినిమా తో దీపావళికి సిద్ధంగా ఉండండి!



# విశ్వక్‌సేన్‌తో కృతిశెట్టి ఆటపాట..

మంగళూరు సోయగం కృతిశెట్టికి అవకాశాలైతే వస్తున్నాయి కానీ.. ఆశించిన స్థాయిలో విజయాలు మాత్రం దక్కడం లేదు. ఏడాదికాలంగా తెలుగు ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్న ఈ అమ్మడు ఇక్కడ భారీ అవకాశం కోసం ఎదురుచూస్తున్నది. తాజా సమాచారం ప్రకారం కృతిశెట్టి టాలీవుడ్‌లో బంపరాఫర్‌ను సొంతం చేసుకున్నట్లు తెలిసింది. యువ హీరో విశ్వక్‌సేన్‌తో జోడీ కట్టబోతున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే... 'జాతిరత్నాలు' ఫేమ్ కేవీ అనుదీప్ దర్శకత్వంలో విశ్వక్‌సేన్ ఓ చిత్రాన్ని చేయబోతున్నాడు. 'వీఎస్ 14' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమా తాలూకు అనౌన్స్‌మెంట్ ఆగస్ట్‌లో వెలువడింది. త్వరలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాలో కృతిశెట్టిని కథానాయికగా ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ విషయంలో ఇప్పటికే సంప్రదింపులు పూర్తయ్యాయని, త్వరలో మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వస్తుందని చెబుతున్నారు. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారని నాన్‌స్టాప్ వినోదంతో ఆకట్టుకుంటుందని మేకర్స్ అంటున్నారు. ప్రస్తుతం కృతిశెట్టి తమిళంలో మూడు చిత్రాలతో బిజీగా ఉంది.



# "లవ్ రెడ్డి" గెలిచాడు, ఇండస్ట్రీ నుంచి చిన్న సపోర్ట్ కోసం ఎదురుచూస్తున్నాం

## హీరో అంజన్ రామచంద్ర

గీతాన్స్ ప్రొడక్షన్స్, సెహెరి స్టూడియో, ఎమ్జీఆర్ ఫిలిమ్స్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం "లవ్ రెడ్డి". అంజన్ రామచంద్ర, శ్రావణి రెడ్డి హీరో హీరోయిన్లు గా నటించారు. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా స్వచ్ఛమైన ప్రేమకథగా నూతన దర్శకుడు స్మరన్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందించారు. ప్రొడ్యూసర్స్ సునంద బి.రెడ్డి, హేమలత రెడ్డి, రవీందర్ జి, మదన్ గోపాల్ రెడ్డి, నాగరాజ్ బీరప్ప, ప్రభంజన్ రెడ్డి, నవీన్ రెడ్డి "లవ్ రెడ్డి" చిత్రాన్ని నిర్మించారు. సుమ, సుస్మిత, హరీష్, బాబు, రవి కిరణ్, జకరియా సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా "లవ్ రెడ్డి" సినిమా నిన్న ( 18వ తేదీ) గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వచ్చి ప్రేక్షకుల నుంచి సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ నేపథ్యంలో మూవీ సక్సెస్ మీట్ ను హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ మదన్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ "లవ్ రెడ్డి" సినిమా చూస్తున్న ప్రేక్షకులు ఎమోషనల్ అవుతున్నారు. సినిమాను ఎలాగైనా నిలబెట్టండి అంటూ మెసేజ్ లు పంపుతున్నారు. నాకు వాళ్లకు తోచిన అమౌంట్స్ యూపీఐ ద్వారా పంపిస్తున్నారు. "లవ్ రెడ్డి" సినిమాతో మా హీరోకు పేరొచ్చింది. మా హీరోయిన్ కు పేరొచ్చింది, మా డైరెక్టర్ కు పేరొచ్చింది. నిర్మాతగా ఆ సంతృప్తి నాకు చాలు. కిరణ్ అబ్బవరం గారు ఫ్రీ షోస్ వేశారు. ఆ ఫ్రీ షోస్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. "లవ్ రెడ్డి" లాంటి మంచి చిత్రానికి మరింతగా మీ ఆదరణ చూపిస్తారని కోరుకుంటున్నాం. థియేటర్స్ లో చూసిన వాళ్ల నుంచి అప్రిషియేషన్స్ వస్తున్నాయి. చూడని వారు రేపు ఓటీటీలో అయినా చూస్తారు కాబట్టి మా టీమ్ ప్రతిభ తప్పకుండా తెలుస్తుంది. అన్నారు. డైరెక్టర్ స్మరణ్ రెడ్డి మాట్లాడుతూ మా "లవ్ రెడ్డి" సినిమాకు అమేజింగ్ రెస్పాన్స్ వస్తోంది. బ్లాక్ బస్టర్ మూవీ అంటున్నారు. అయితే సినిమాను ప్రేక్షకుల దగ్గరకు మరింతగా రీచ్ చేయడంలో మేము ఫెయిల్ అయ్యాం. మా మూవీని ఆడియెన్స్ కు రీచ్ చేయడంలో తగినంత టైమ్ దొరకలేదు. మూడేళ్లు సినిమా కోసం కష్టపడ్డాం. ఇందులో ఏడాది పూర్తిగా పోస్ట్ ప్రొడక్షన్ మీద స్పెండ్ చేశాం. ఇదంతా ప్రేక్షకులకు మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేందుకే. అందుకే ప్రేక్షకులు టీవీలో కాకుండా థియేటర్ లోనే మా సినిమా చూడాలని మేమంతా కోరుకుంటున్నాం. అన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.